بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

www.akhbarbadr.in

21- మే 2026 క్రీ, శ. 21- హిజ్రత్ 1405 హి, శ. 04- జుల్ హజ్ 1447 హి,ఖ.

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

సంపుటి: 11 సంచిక : 21

వార్షిక చందా 600/-రూ॥

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్యవంతమైన, చురుకైన సుదీర్ఘ జీవితంను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను నమకూర్చుగాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాకా! *(ఆమీన్)*

اَللّٰھُمَّ اَیِّدْ اِمَامَنَا بِرُوْحِ الْقُدُسِ وَبَارِکْ لَنَا فِیْ عُمُرِہٖ وَاَمْرِہٖ

## ఈ సంచికలో ...

**(1) సంపాదకీయం:** అప్పు ఇచ్చి పుచ్చుకునే విధానంను గూర్చి ఇస్లామీయ బోధనలు...2లో.

**(2) 30 జనవరి 2026 నాటి జుమా ప్రసంగం ........ పేజి 3లో.**

**(3) 06 ఫిబ్రవరి 2026 నాటి జుమా ప్రసంగం ........ పేజి 8లో.**

(ప్రకటనలు, దుఆలు గలవు.)

## ప్రవక్త(స)ప్రవచనాలు:- అప్పు చెల్లించు సామర్థ్యము కొరకు దుఆ:

عَنْ اَبِیْ ھُرَیْرَۃَ رَضِیَ اللّٰہُ عَنْہُ اَنَّ رَجُلًا اَتَی النَّبِیَّ صَلَّی اللّٰہُ عَلَیْہِ وَسَلَّمَ یَتَقَاضَاہُ فَاَغْلَظَ لَہٗ. فَھَمَّ بِہٖ اَصْحَابُہٗ فَقَالَ رَسُوْلُ اللّٰہِ صَلَّی اللّٰہُ عَلَیْہِ وَسَلَّمَ دَعُوْہُ فَاِنَّ لِصَاحِبِ الْحَقِّ مَقَالًا ، ثُمَّ قَالَ: اَعْطُوْہُ سِنًّا مِثْلَ سِنِّہٖ. قَالُوْا : یَا رَسُوْلَ اللّٰہِ لَا نَجِدُ اِلَّا اَمْثَلَ مِنْ سِنِّہٖ. قَالَ : اَعْطُوْہُ فَاِنَّ خَیْرَکُمْ اَحْسَنُکُمْ قَضَاءً.

(مسلم کتاب البیوع باب من استسلف شیئًا فقضی خیرًا منہ)

**అనువాదం:** హజ్రత్ అబూహురైరహ్ రజి ఇలా ఉల్లేఖించారు. ఒక వ్యక్తి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి వచ్చాడు. తన అప్పును తిరిగి చెల్లించమని ప్రవక్త (స)ను కోరినాడు. ఈ క్రమంలో అతడు చాలా దురుసుగా ప్రవర్తించాడు. ప్రవక్త (స) అనుచరులు చాలా కోపం వచ్చింది. ఆ వ్యక్తిని కోపగించసాగారు. ప్రవక్త (స) ఇలా అన్నారు. అతనిని ఏమి అనకండి!. ఎందకనగా అప్పు వసూలు చేసుకునే వ్యక్తికి కఠినముగా మాట్లాడే హక్కు కూడ ఉంటుంది. మరల ప్రవక్త (స) ఇలా అన్నారు: అతనికి (అప్పు క్రింద) అతడు వసూలు చేసుకోవాలనుకున్న వయస్సు గల జంతువును ఇచ్చి పంపండి. అందుకు అనుసరులు (రజి) " ప్రస్తుతం అతడు కోరుకున్న దానికంటే పెద్ద వయస్సు గల జంతువులే ఉన్నాయి " అని సమాధానం ఇచ్చారు. ప్రవక్త (స) ఇలా అన్నారు. ఆ జంతువునే ఇవ్వండి. ఎందుకనగా తన అప్పును ఉత్తమ పద్దతిలో తిరిగి ఇచ్చు వ్యక్తియే మీలో ఉత్తమమైన వ్యక్తి.

**(ముస్లిం కితాబుల్ బుయూ బాబ్ మన్ ఇస్తతస్లఫ షైఅన్ ఫఖజా ఖైరన్ మిన్‌హు)**

عَنْ عَلِیٍّ رَضِیَ اللّٰہُ عَنْہُ اَنَّ مُکَاتَبًا جَآءَہٗ فَقَالَ : اِنِّیْ عَجَزْتُ عَنْ کِتَابَتِیْ فَاَعِنِّیْ قَالَ : اَلَا اُعَلِّمُکَ کَلِمَاتٍ عَلَّمَنِیْھِنَّ رَسُوْلُ اللّٰہِ صَلَّی اللّٰہُ عَلَیْہِ وَسَلَّمَ : لَوْ کَانَ عَلَیْکَ مِثْلُ جَبَلٍ دَیْنًا اَدَّاہُ اللّٰہُ عَنْکَ. قُلْ : اَللّٰھُمَّ اکْفِنِیْ بِحَلَالِکَ عَنْ حَرَامِکَ وَاَغْنِنِیْ بِفَضْلِکَ عَمَّنْ سِوَاکَ. (ترمذی کتاب الدعوات باب جامع الدعوات)

**అనువాదం:** హజ్రత్ అలీ రజి ఇలా ఉల్లేఖించారు: వారి వద్దకు విడదలకు తగిన ఒప్పందంను కుదుర్చుకున్న ఒక బానిస వచ్చి ఇలా విన్నవించుకున్నాడు. తాను జరేకితాబత్ అనగా పరిహారం చెల్లించి విముక్తి పొందలేకపోతున్నాను. ఈ విషయంలో మీరు నాకు సహాయం చేయండి. అందుకు వారు రజి ఇలా అన్నారు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నాకు నేర్పించినటు వంటి ఒక దుఆను నేను నీకు నేర్పించనా?. తద్వారా ఒకవేళ పర్వతానికి సమానమైన అప్పు ఉన్నప్పటికి అల్లాహ్ తాలా ఆ దుఆ ఫలితముగా ఆ అప్పును తీర్చే మార్గాలను నీ కోసం తెరుస్తాడు. మరల ఇలా అన్నారు: నీవు ఈ దుఆను పఠించుము. " ఓ నా అల్లాహ్!. నీవు అనుగ్రహించే ధర్మబద్ధమైన సంపదయే నాకు సరిపడునట్లు చూడుము!. అధర్మబద్ధమైన సంపద ఆకాంక్షను నాలో పెంచుకుము!. అనగా నాకు ధర్మబద్ధమైన సంపదను అనుగ్రహించుము. అధర్మ సంపాదననుండి కాపాడుము. మరియు నీ అనుగ్రహంతో నన్ను నీవు నిన్ను కాకుండా ఇతరులను అర్థించకుండా, యాచించకుండా చూడుము!. అనగా ఎన్నడు ఇతరుల ముందు చేయి చాచకుండా చూడుము!. (తిర్మిజి,కితాబుల్ దువాత్, బాబ్ జామిఉ ద్దువాత్)

**(సేకరణ: హదీఖత్తుస్సాలిహీన్ హదీస్ సంఖ్య 832,835)**

## మానవుడు ముందు నుండే తన ఆధాయ వనరులను పొదుపుగా వాడుకొనవలెను. ఫలితముగా అసలు కంటే ఎక్కువగా చెల్లించునట్టి వడ్డిపై అప్పుచేయు దుస్థితి ఏర్పడదు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు:

అల్లాహ్ తాలాపై నమ్మకంను పెంచుకున్న వ్యక్తికి, అల్లాహ్ తాలా ఏదో ఒక మార్గంమును ఊహకందని విధముగా తెరుస్తాడు. ప్రజలు ఈ ఆంతర్యాన్ని తెలుసుకోక పోవడం చాలా విచాకరం!. అల్లాహ్ తాలా ఎన్నడు కూడ నిష్టాపరులకు వడ్డి రూపంలో అప్పు తీసుకునే క్లిష్ట పరిస్థితులను రానివ్వడు. ఇతర పాపముల వలే అప్పు ఇవ్వడం, అప్పు తీసుకోవడం కూడ ఒక పెద్ద పాపామేనని గుర్తుంచుకొనుము. ఇది ఎంతటి నష్టవ్యాపార మనగా, ధనము కూడ పోతుంది, స్థాయి కూడ తగ్గుతుంది, విశ్వాసం కూడ చేజారుతుంది. ఒక సాధారణ జీవితంలో ఇంతగా అనగా అప్పు తీసుకోని ఖర్చు చేయవలసిన అవసరమే ఏమి లేదు. ఉదా॥ వివాహం కోసం. వివాహంలో ఎలాంటి ఖర్చుయే లేదు. ఇరుపక్షాల వారు అంగీకరిస్తారు, వివాహం జరిగిపోతుంది. ఆ తరువాత వలీమా విందు సాంప్రదాయం. ఒకవేళ ఇందుకు కూడ స్థోమత లేనిచో అది కూడ మన్నించబడుతుంది. ఒకవేళ మానవుడు పొదుపును పాటిస్తూ ఖర్చు చేసినచో అతనికి ఎలాంటి కష్టాలు రావు. మానవులు తమ మనోవాంచనల కోసం, తాత్కాలిక ఆనంధం కోసం అల్లాహ్‌కు ఆగ్రహాన్ని తెప్పిస్తుంటారు. ఇది చాలా విచారకం!. తరువాత అదే వారి వినాశనానికి కారణమవుతుంది. వడ్డితో కూడ అప్పు ఎంతపెద్ద పాపమో చూడండి!. ఈ విషయం వారికి తెలియదా?. దిక్కులేని స్థితిలో కొద్దిపాటి పంది మాంసాన్ని అనుమతించబడింది. ఈ విషయాన్ని ఇలా తెల్పడం జరిగింది.

فَمَنِ اضْطُرَّ غَیْرَ بَاغٍ وَّلَا عَادٍ فَلَآ اِثْمَ عَلَیْہِ ؕ اِنَّ اللّٰہَ غَفُوْرٌ رَّحِیْمٌ ○

అనగా: ఒకవేళ వ్యక్తి విద్రోహి కానిచో, హద్దును దాటని వాడు కానిచో, అతనిపై ఎలాంటి పాపం లేదు. నిశ్చయముగా అల్లాహ్ క్షమాప్రపూర్ణుడు, దయసాగరుడు. కాని దిక్కులేని స్థితిలో కూడ వడ్డితో కూడిన అప్పుకు ఎలాంటి అనుమతిని ఇవ్వలేదు.

**(7వ పేజిలో చదువుము)**

## ఖుర్ఆన్ బోధనలు

یٰۤاَیُّھَا الَّذِیْنَ اٰمَنُوْۤا اِذَا تَدَایَنْتُمْ بِدَیْنٍ اِلٰۤی اَجَلٍ مُّسَمًّی فَاکْتُبُوْہُ ؕ ......... وَاللّٰہُ بِکُلِّ شَیْءٍ عَلِیْمٌ ﴿۲۸۳﴾

అనువాదం: ఓ విశ్వాసులారా! నిశ్చిత కాలం వరకు మీరొకరి వద్ద ద్రవ్యమును ఋణముగా తీసుకొన్నప్పుడు వ్రాసి పెట్టుకొనుడు. మీ సమక్షమున దస్తూరి కర్త, న్యాయముగా వ్రాయవలెను. ఏ దస్తూరి కర్త వ్రాయుడానికి నిరాకరించ కూడదు. అల్లావ్ నేర్పిన విధముగా అతడు వ్రాయవలెను. ఋణగ్రహీత అల్లాహ్, తన ప్రభువుకు భయపడి ఏ ఆంశమును కూడ తీసివేయ రాదు. ఋణగ్రహీతకు అల్ప జ్ఞానమున్నను, వ్రాయించుటకు సామర్థ్యము లేకున్నను అతని వారసుడు (అతని ప్రాతినిధ్యములో) న్యాయము నవలంభించి వ్రాయించవలెను. మీలో ఇద్దరు పురుషులను సాక్షులుగా నిర్ణయించుకొనుడు. ఇద్దరు పురుషులు దొరకని పక్షమున ఒక పురుషుడు ఇద్దరు స్త్రీలను సాక్షులుగా మీరు ఇష్టపడిన వారిని తీసుకోవలెయును. ఎందుకనగా ఆ ఇద్దరు స్త్రీలలో ఎవరైనను మరిచిపోయినచో జ్ఞాపకము చేయుటకు మరొకరు అవసరం. సాక్షులుగా పిలిచినప్పుడు నిరాకరించకుడు. ఋణద్రవ్యము చిన్నదైనను, పెద్దదైనను నియమిత కాలమును వ్రాయుటకు వెనకాడ కూడదు. మీ ఈ వ్యవహారము అల్లాహ్ దృష్టిలో న్యాయసమ్మతము, సాక్ష్యమును మరింత నిర్ధుష్టముగా కాపాడునది. ఏ విధమైన సందేహములకు అవకాశము లేకుండా చేయునది. చేతులతో ఇచ్చి పుచ్చుకొను పద్దతిలో తప్ప వ్యవహారము నందు వ్రాతను ఎప్పుడు కాదనకూడదు. ఇచ్చి పుచ్చుకొను వ్యాపారము నందు వ్రాసినను, వ్రాయకున్నను పాపము లేదు. మీరు ఒక వస్తువును అమ్మినను, కొన్నను సాక్షిని ఏర్పాటు చేసుకొనుడు. వ్రాయదానికి గాని, సాక్షికి గాని ఏ విధమైన కష్టము కలగించ కూడదు. మీరు ఇట్లు చేసినచో మీ కొరకు ఇది పాపమగును. అల్లాహ్‌కు భయపడుడు. మీకు జ్ఞానము ప్రసాదించునదే అల్లాహ్. అల్లాహ్ అన్ని ఆంశములను ఎరుగును.

**(బఖరహ్:283)**

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

## సంపాదకీయం:

## అప్పు ఇచ్చి పుచ్చుకునే విధానంను గూర్చి ఇస్లామీయ బోధనలు:

మన సాంస్కృతిక మరియు సామాజిక జీవితంలో పరస్పర లావాదేవీలు మరియు వ్యవహారాలు ఒక ముఖ్యమైన భాగం. మనుషులు తమ అవసరాలను తీర్చుకోవడానికి ఒకరికి మరొకరి సహాయం అవసరం పడుతూనే ఉంటుంది. కాని ఈ లావాదేవీలు అప్పుల రూపం దాల్చినప్పుడు అనేక సామాజిక సమస్యలకు దారి తీస్తాయి. అన్నదమ్ముల మధ్య విభేదాలు వస్తాయి, స్నేహితుల మధ్య గొడవలు తలెత్తుతాయి. వ్యాపార సంస్థలు మరియు బ్యాంకుల నుండి పెద్ద మొత్తంలో అప్పులు తీసుకున్నప్పుడు కొన్నిసార్లు అది వినాశనానికి మరియు అవమానానికి కూడా దారితీస్తుంది.

అందువల్ల సర్వశక్తిమంతుడైన అల్లాహ్ , తనను దేవుని సేవకుడిగా భావించే ప్రతి విశ్వాసికి, ఈ సామాజిక చెడు నుండి తనను తాను కాపాడుకోవాలని ఆదేశించాడు. అదే విధముగా తగాదాలు, అవమానం మరియు అపకీర్తిని ఎలా నివారించాలో కూడా మార్గాన్ని చూపించాడు. ఇస్లాం అప్పు ఇచ్చేవారికి, ఆ అప్పును తిరిగి ఎలా కోరాలో కూడ నేర్పింది. అలాగే అప్పు తీసుకునే వారికి తమ బాధ్యతలను గౌరవప్రదంగా ఎలా నెరవేర్చాలో కూడా నేర్పింది. తద్వారా వారు సమాజంలో తమ గౌరవాన్ని కాపాడుకోవచ్చు లేదా పెంచుకోవచ్చు. పవిత్ర ఖుర్ఆన్ మానవ మనస్తత్వాన్ని దృష్టిలో ఉంచుకుని అప్పుల లావాదేవీలను ఎలా లిఖితపూర్వకంగా నమోదు చేయాలో కూడ క్షుణ్ణముగా బోధించింది; ఉద్దేశాలు మంచివైతే ఇరుపక్షాలకూ ఎటువంటి ఇబ్బందులు కలగవు. అల్లాహ్ ఇలా తెలిపాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا إِذَا تَدَايَنتُم بِدَيْنٍ إِلَىٰ
أَجَلٍ مُّسَمًّى فَاكْتُبُوهُ ..........................

"ఓ విశ్వాసులారా! మీరు ఒక నిర్దిష్ట గడువు వరకు అప్పు లావాదేవీ చేసుకుంటే దానిని వ్రాసి పెట్టుకోండి."

ఈ ఆజ్ఞ ఎంత అందమైనదో గమనించండి. అయితే కొంతమంది "మాకు ఒకరిపై మరొకరికి పూర్తి నమ్మకం ఉంది. దానిని వ్రాయాల్సిన అవసరం ఏముంది? మేము అన్నదమ్ముల్లాంటి వాళ్లం. వ్రాసుకోవడం అంటే అనుమానం ఉన్నట్టే. అది మన మధ్య దూరం మరియు అసంతృప్తిని పెంచుతుంది." అని అంటారు. అలాంటి వారు గుర్తుంచుకోండి!. సంబంధాలు ఖుర్ఆన్ ఆజ్ఞలను అనుసరించడం వల్ల చెడిపోవు. వాటిని ఉల్లంఘించడం వల్లే చెడిపోతాయి. కొంతమంది అప్పు చిన్న మొత్తమే కదా!, దానిని వ్రాయవలసిన అవసరం ఏమున్నది?, ఇంత చిన్న మొత్తాన్ని గూర్చి వ్రాయడం సిగ్గుగా అనిపిస్తుందని అంటారు. ఉదా॥ వివాహాలు లేదా కుటుంబ కార్యక్రమాల్లో కొన్నిసార్లు వస్తువులను తాత్కాలికంగా తీసుకుంటారు; అవి కూడా ఈ వర్గంలోకే వస్తాయి. ఎందుకంటే అలాంటి చిన్న విషయాల వల్ల కూడా అపార్థాలు మరియు అనుమానాలు పుడుతాయి. భవిష్యత్తులో విభేదాలు రాకుండా ఉండటానికి ఒక చిన్న లిఖిత పత్రం తయారు చేయడం ఉత్తమ మార్గం.

అల్లాహ్ ఆజ్ఞ ఏమిటంటే లావాదేవీ చిన్నదైనా పెద్దదైనా దానిని తప్పకుండా వ్రాసుకోవాలి. ఆయన ఇలా అంటాడు:

**వలా తస్అమూ అన్‌తక్‌తుబూహు సఘీరన్ అవ్ కబీరన్ ఇలా అజలిహి**

అనగా లావాదేవీలు చిన్నదైనా, పెద్దదైనా, దానిని దాని నిర్ణయిత సమయం వరకు, అనగా ఎప్పటి వరకు చెల్లించాలని నిర్ణయించు కున్నారో ఆ తేదిని కూడ వ్రాసుకోండి. అదే విధముగా ఒప్పందపు వివరాలు కూడ వ్రాసుకోండి. దాని గడువుతో సహా వ్రాయడంలో నిర్లక్ష్యం చూపకూడదు. లేదా దానిని సాధారణమైన విషయముగా భావించకూడదు. ఎందుకనగా ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే షైతాన్ మనసుల్లో అనుమానాలు మరియు అపనమ్మకాలను కలిగిస్తాడు. మొదట గొప్ప మనసును ప్రదర్శిస్తుంటారు. అలా నీవు చేసిన పని తర్వాత ఎలాంటి పరిస్థితిలో నిన్ను నిలబెడుతుందనగా, అప్పుడు నీవు గొప్ప మనస్సును ప్రదర్శించడం ప్రక్కన పెడితే చివరికి చిన్నపాటి మంచితనాన్ని కూడ ప్రదర్శించలేకపోతావు. సాధారణంగా ఇలాగే జరుతుంది. ఇలాంటి సమస్యలే సాధారణముగా మనకు కనిపిస్తుంటాయి. అనగా ఇది కేవలం ఊహతో మాట్లాడే మాటలు కావు. ఇలాంటి తగాదాలు తరచుగా జరుగుతుంటాయి. ఇలాంటి ఆర్థిక లావాదేవీల విషయంలో, ఇలాంటి వ్యవహారాలలో, చాలా మంది ఖజాలలో, అమూరే ఆమాలో, జమాఅత్‌లో లేదా దేశానికి చెందిన న్యాయస్థానాలలో కేసులు తరచుగా నమోదుచేయబడుతాయి, కేసులు నడుస్తుంటాయి. ఒకప్పుడు కలిసి మేలసి తిన్నవారు, కలిసి కూర్చున్నవారు, ఆత్మీయ స్నేహితులు కూడా తర్వాత ఒకరికి ఒకరు బద్ధ శత్రువులవుతారు. కోర్టులలో కొన్నిసార్లు ఒకరికి వ్యతిరేకముగా మరొకరు తప్పుడు సాక్షులను కూడా వెతుకుతారు. ఇది అంతా అల్లాహ్ ఆజ్ఞలను పాటించకపోవడం వల్లనే జరుగుతుంది.

తన సృష్టిజీవులను మరియు స్వభావాన్ని బాగా తెలిసిన అల్లాహ్, ఒప్పందాలను ఎలా వ్రాసుకోవాలో కూడ తెలిపాడు. ఏ విధముగా వ్రాసుకోవాలి, ఎవరు వ్రాయించుకోవాలి. అప్పు పత్రంను వ్రాయించుకొను బాధ్యతను అల్లాహ్ తాలాఅప్పు తీసుకునే వారిపై వేశాడు. ఈ క్రమంలోనే అల్లాహ్ ఇలా అన్నాడు:

**"వల్ యుమ్‌లిలిల్లజీ అలైహిల్ హఖ్ఖు వల్ యత్తఖిల్లాహ్ రబ్బహు వలా యబ్‌ఖస్ మిన్‌హు షైఅన్."**

అనగా, ఋణగ్రహితుడు అల్లాహ్ మరియు తన ప్రభువుకు భయపడి ఏ అంశమును కూడ తీసి వేయకూడదు.

అనగా, అప్పు తీసుకున్నవాడే వ్రాయించాలి. ఇందుకు గల కారణ: ఉదా॥ అప్పు తీసుకున్న వ్యక్తి నేను ఇంత మొత్తంలో అప్పు తీసుకున్నాను మరియు అప్పు తిరిగి చెల్లింపు షరతులను కూడ అప్పుతీసుకున్న వ్యక్తి చెప్పినట్లుగానే స్పష్టంగా వ్రాసుకోవాలి. ఉదాహరణకు వాయిదాలు లేదా గడువు అయినతో, ఇన్ని వాయిదాలలో, ఒకవేళ సమయాన్ని నిర్ణయించుకున్నచో ఇంత కాలంలో చెల్లిస్తానని వంటివి కూడ వ్రాసుకోవాలి. తద్వారా తర్వాత అతను "నన్ను మోసం చేశాడు" అని, లేదా కొన్ని పదాలను అటుఇటుగా ఒప్పందంలో వ్రాసుకున్నాడు, ఫలితముగా నేను ప్రభావితుడిని అయ్యాను అని అప్పుతీసుకున్న వ్యక్తి ఆరోపణచేయడానికి అవకాశం ఉండదు. ఇలాంటి వాటిని నుండి కాపాడబడుటకే అప్పు తీసుకున్న వ్యక్తియే స్వీయముగా వ్రాయించాలని తెల్పడం జరిగింది. ఇలాంటి విధానం కూడ మీకు కేవలం ఇస్లామీయ సమాజంలోనే, ఇస్లామీయ బోధనలలోనే కనిపిస్తుంది. అప్పు ఇచ్చే వ్యక్తిని పుణ్యాత్ముడిగా పేర్కొనడం జరిగింది. ఒకవేళ అతడు అప్పు ఇస్తున్నప్పుడు సులువైన నిబంధనలను ఏర్పాటు చేసుకున్నచో అతనికి పుణ్యఫలం కూడ దక్కుతుంది.

నేటి ప్రపంచంలో సాధారణంగా అప్పు ఇచ్చేవారే కఠినమైన షరతులు విధించడాన్ని మనం చూస్తుంటాము. కానీ ఇస్లామీయ బోధనలో అప్పు తీసుకునే వ్యక్తియే షరతులను నిర్ణయించవచ్చును. అప్పు ఇచ్చేవ్యక్తి అట్టి సులువైన షరతులను అంగీకరిస్తే అతనికి ఆధ్యాత్మిక ఫలితం లభిస్తుంది అని అతనికి తెల్పడం జరిగింది. (ఇందుకు చెందిన కొన్ని హదీస్‌లను తరువాత పేర్కొంటాను)

అప్పు తీసుకున్నవ్యక్తి షరతులకు అంగీకరించిన తర్వాత వాటిని నెరవేర్చాల్సిన నైతిక బాధ్యత కూడ అతనిపైనే ఉంటుంది. అతను ఇక అన్యాయం జరిగిందనే ఆరోపణ చేయడానికి ఎలాంటి అవకాశం ఉండదు, ఉండకూడదు. అప్పు ఇచ్చిన వ్యక్తి విషయంలో ఎలాంటి ఫిర్యాదు ఉండకూడదు. ఇదే ఇస్లామీయ సమాజం యొక్క అందం. అవసరంలో ఉన్నవారికి న్యాయబద్ధముగా మరియు సామరస్యాన్ని కాపాడుతూ సహాయం చేయడం. ఒకవేళ ఇరువురికీ వ్రాయడం రాకపోతే, వ్రాయగలిగిన బంధువులు లేదా స్నేహితులు, పరిచయస్థుల సహాయం తీసుకోని వ్రాసుకోవాలి. అదే విధముగా దస్తూరిదారుడికి న్యాయబద్ధముగా, సమన్యాయముగా వ్రాయాలని ఆదేశించడం జరిగింది. (ఇస్లాం) ఈ విషయానికి కూడ చాలా ప్రాధాన్యతను ఇచ్చింది. బంధుత్వం లేదా వ్యక్తిగత అనుబంధం కారణంగా ఒకరిపక్షాన అన్యాయంగా వ్యవహరించకూడదని కూడ హెచ్చరించింది. అదే విధముగా అల్లాహ్ తాలా మీకు ఇచ్చిన జ్ఞానాన్ని అనగా దస్తూరి వ్రాయి విధానమును నేర్పించినాడు. కావున మీకు అతడు ఇచ్చే ఆదేశమేమనగా, ఎవరైన మీ వద్దకు ఏ విధమైన దస్తూరిని వ్రాయించుకొనుటకు వచ్చినచో మీరు వ్రాయుటకు నిరాకరించవద్దు. సమాజం మొత్తాన్ని ఏకం చేయడం జరిగింది. అదే విధముగా ఇస్లాం బలహీనులను కూడా రక్షిస్తుంది. అప్పు తీసుకునేవాడు అజ్ఞాని అయితే లేదా మానసికంగా బలహీనుడైతే, అట్టి స్థితి నుండి అవకాశాన్ని పొందుతూ అప్పు ఇచ్చేవారు అతన్ని మోసం చేయకూడదు. అందుకే అతని తరఫున సంరక్షకుడు లేదా బంధువు సహాయంగా ముందుకు వచ్చి దస్తూరి వ్రాయించాలి. కొన్నిసార్లు ధనవంతులైన చిన్న వయస్కుల వారి నుండి కూడా కొందరు అప్పు తీసుకుంటారు. వారిని కూడ కాపాడాలి. అంతేగాకుండా కొందరు చిన్న మొత్తం ఇచ్చి తర్వాత అధిక లాభం లేదా వడ్డీ పేరుతో ఎన్నో రెట్లు అధికముగా వసూలు చేస్తారు. ఇస్లాం ఇలాంటి అన్యాయాన్ని నిషేధిస్తుంది. ఇంతకు మించి మరీ జాగ్రత చెప్పడం జరిగింది. కొన్ని సందర్భాలలో కొన్నిసార్లు ఇరువురి మధ్య విభేదాలు పొడచూపుతాయి. ప్రతి ఒక్కరు తమకు అనుకూలమైన విషయాన్నే వివరిస్తుంటారు. ఫలితముగా గొడవలు, ద్వేషాలు కల్గుతుంటాయి. ఇలాంటి వాటి నుండి కూడ కాపాడబడుటకు భవిష్యత్తులో తగాదాలు రాకుండా ఉండటానికి సాక్షులతో సాక్షి సంతాకాలు కూడ పెట్టించాలి. ఈ విషయాన్నే అల్లాహ్ తాలా ఇలా తెలిపాడు. **"వస్తష్‌హిదూ షహీదైని మిన్ రిజాలికుం."** అనగా, "మీ పురుషులలో ఇద్దరిని సాక్షులుగా ఉంచండి." ఇద్దరు పురుషులు లేకపోతే, ఒక పురుషుడు మరియు ఇద్దరు మహిళలు సాక్షులుగా ఉండవచ్చు. ఒకరు మరచిపోతే మరొకరు గుర్తు చేయగలరు. ఇక్కడ ఇద్దరి మహిళల సాక్ష్యం ఒక పురుషుడితో సమానమనే విషయాన్ని కూడ ఇక్కడ పేర్కొనడం జరిగింది. ఇది ఆర్థిక లావాదేవీలలో న్యాయాన్ని ఎంత జాగ్రత్తగా కాపాడుతున్నదో చూపిస్తుంది. మరల ఆ సూక్తిలోనే ఈ విధానాన్ని పాటించకపోతే ధర్మభక్తి (తక్వా) నుండి దూరమవుతారని అల్లాహ్ రెండు సార్లు హెచ్చరిస్తాడు. ఈ హెచ్చరిక లావాదేవీలో పాల్గొన్నవారికే కాదు, వ్రాసేవారికి మరియు సాక్షులకు కూడా వర్తిస్తుంది. చివరిలో ఈ విషయాన్ని కూడ తెల్పడమైనది. అనగా బహుశా ఒకరు మరొకరిని ఏదో ఒక విధముగా మోసం చేసుకోవచ్చును, హక్కులను హరించివేయవచ్చును, ఉత్తమ పద్దతిలో తిరిగి చెల్లించక పోవచ్చును, ఏదో విధముగా సాక్ష్యులపై ఒత్తిడిని పెంచి, నేటి కాలంలో జరుగుతున్నట్లుగా తమకు అనుకూలంగా సాక్ష్యం చెప్పించుకోవచ్చును. ఇలాంటి వారు గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, మనుషులను మోసం చేయవచ్చు కానీ అల్లాహ్‌ను ఎవరు మోసం చేయలేరు. ప్రతి లావాదేవీ యొక్క నిజమైన పరిస్థితులు ఆయనకు తెలుసు. లావాదేవీలు అసలు ఏ షరతులపై జరిగాయి, అసలు దస్తూరి ఏమిటి అనేది కూడ అల్లాహ్‌కు బాగుగా తెలుసు. ఒకవేళ దస్తూరిలో మార్పులు చేర్పులు చేసినచో అతడు తప్పకుండా పట్టుకుంటాడు. ఒకవేళ సాక్షులను ప్రలోభపెట్టినచో అందుకు కూడ మీరు శిక్షార్హులే. ఎందుకనగా అది కూడ పెద్ద నేరమే.

అందుకే ప్రతి ఒక్కరు ఎల్లప్పుడు గుర్తుంచుకోవలసిన విషయమేమనగా, నగదు లావాదేవీలు తప్ప, వాయిదా లేదా అప్పు ఆధారిత లావాదేవీలు అన్నీ తప్పకుండా లిఖితపూర్వకంగా ఉండాలి. నేడు అనేక వ్యాపారాలు మాటపై జరుగుతున్నాయి. ఉద్దేర వ్యాపారాలు కూడ కొనసాగుతున్నాయి. **(7వ పేజిలో చదువుము)**

# జుమా ప్రసంగము

**ఎక్కడైతే అల్లాహ్ గౌరవం, అతని పట్ల ప్రేమకు సంబంధించిన ప్రశ్న తలెత్తిందో, అక్కడ మహా ప్రవక్త (స) తన ప్రాణాలను కూడా లెక్కచేయలేదు. అంతకుముందు వ్యూహాత్మక కారణాల వల్ల సమాధానం ఇవ్వకూడదని భావించినప్పటికీ దైవ గౌరవానికి భంగం కలగడం వలన వెంటనే సమాధానం ఇవ్వమని అనుచరులను ఆదేశించారు.**

---

**వనరులపై భరోసా, తనపై తనకున్న నమ్మకం, తన యోగ్యతపై నమ్మకం, తన సంపదపై, తన వంశం మరియు తెగపై, తన సంతానంపై భరోసా సంక్షిప్తంగా చెప్పాలంటే, మనిషి అల్లాహ్‌ను ప్రథమ స్థానంలో ఉంచకుండా, అల్లాహ్ పేరు స్మరించకుండా ఏ వస్తువుపై భరోసా ఉంచినా, అది అన్యారాధన కిందకే వస్తుంది.**

---

**వైభవంతుడైన అల్లాహ్ తన మార్గంలో బయలుదేరిన వ్యక్తికి ఈ బాధ్యతను తనపై ఉంచుకున్నాడు: నేను అతడిని అతను పొందిన ప్రతిఫలం లేదా యుద్ధ సంపదతో సురక్షితంగా తిరిగి ఇంటికి చేరుస్తాను లేదా అతడిని జన్నత్ (స్వర్గం)లో ప్రవేశింపజేస్తాను.అంటే, అయితే విజయం లభిస్తుంది లేదా అమరత్వం లభిస్తే స్వర్గం లభిస్తుంది.**

---

**దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను చూడండి, ఆయనకు దైవం పట్ల ఎంతటి అవగాహన ఉండేదో, ఆయన ఎంతటి జాగ్రత్త వహించేవారో! ఆయన అల్లాహ్ పట్ల ఎంతటి భయభక్తులు కలిగి ఉండేవారో గమనించండి. మానవులందరి కంటే పరిపూర్ణులైనప్పటికీ, సర్వ పాపాలకు అతీతులైనప్పటికీ, అల్లాహ్ స్వయంగా ఆయనకు రక్షకుడిగా, సంరక్షకుడిగా ఉన్నప్పటికీ, అట్టి పవిత్రత, నిర్మలత్వం ఉన్నా సరే, ఆయన స్థితి ఎలా ఉండేదంటే, ప్రతిక్షణం అల్లాహ్‌కు భయపడుతూ ఉండేవారు.ఆయన ఒక పుణ్యం తర్వాత మరొక పుణ్యం చేస్తూ ఉండేవారు, అత్యున్నతమైన కర్మలను ఆచరించేవారు. ఒక పుణ్య పని తర్వాత మరో పుణ్యపని చేస్తూ ముందుకు సాగేవారు. ఆయన విషయంలో చెడు అనే మాటే పుట్టదు, దాని ఛాయ కూడా ఉండేది కాదు. ఆయన నిరంతరం దైవారాధనలో నిమగ్నమై ఉండేవారు. అయినప్పటికీ, ఆయన అల్లాహ్‌కు ఎంతో భయపడేవారు.**

---

**అల్లాహ్ తఆలా దైవ ప్రవక్త(స)గారికి ఆఖరి క్షణాల్లో నీవు కోరుకుంటే ఈ లోకంలోనే ఉండవచ్చు లేదా నీవు కోరుకుంటే నా వద్దకు రావచ్చు అని అల్లాహ్ అవకాశం ఇచ్చాడు. అప్పుడు ప్రవక్త (స) ఇలా విన్నవించారు: 'ఓ నా ప్రభూ! ఇప్పుడు నేను నీ వద్దకు రావాలనే కోరుకుంటున్నాను.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 30 జనవరి 2026 ( 30 సులహ్ 1405 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ۔ بِسْمِ اللهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి దైవప్రేమకు సంబంధించి లెక్కలేనన్ని సంఘటనలు ఉన్నాయి. వాస్తవానికి ఆయన ప్రతి చర్య, ప్రతి సందర్భం, ఆయన హృదయంలో ప్రతి క్షణం దైవప్రేమ అనే సముద్రం ఉప్పొంగుతూ ఉండే దని నిరూపిస్తాయి. దీనికి సంబంధించిన ఒక దృశ్యం మనకు ఉహుద్ యుద్ధంలో కనిపిస్తుంది, అక్కడ ఆయన దైవప్రేమలోని తపన ఒక విలక్షణమైన శైలిలో వ్యక్తమైంది.

హజ్రత్ బరా రజియల్లాహు అన్హు ఉల్లేఖించిన కథనం ప్రకారం. ఉహుద్ యుద్ధం రోజున మేము అన్యారాధకులను ఎదుర్కొన్నాము. దైవ ప్రవక్త(స) ఒక విల్లుకారుల దళాన్ని నియమించి, హజ్రత్ అబ్దుల్లాహ్‌ను వారికి అధిపతిగా నియమించారు. మీరు మీ స్థానాన్ని వీడకండని ఆయన గట్టిగా ఆదేశించారు. ఒకవేళ మేము వారిపై విజయం సాధించినట్లు మీరు చూసినా కూడ అక్కడి నుండి కదలవద్దు, ఒకవేళ వారు మాపై పైచేయి సాధించినట్లు చూసినా, మా సహాయానికి రావద్దు అని చెప్పారు. అంటే, గెలుపు ఓటములు ఏవైనా సరే, మీరు మీ స్థానాన్ని వదలకూడదని అర్థం.ఈ సంఘటన చివరలో మనకు కనిపించే విషయం ఏమిటంటే, ఆయనలో దైవప్రేమ ఉత్సాహం ఎలా ఉండేదో అర్థమవుతుంది. కథకుడు ఇలా వివరిస్తున్నారు. యుద్ధం ప్రారంభమైనప్పుడు శత్రువులు పారిపోయారు. అన్యారాధకుల మహిళలు పర్వతాల వైపు పారిపోవడం నేను చూశాను. వారు తమ వస్త్రాలను పైకి ఎత్తుకుని పారిపోతుండగా వారి కాళ్ళపట్టీలు కనిపిస్తున్నాయి. అప్పుడు ముస్లింలు మాలె ఘణీమత్ ఇది యుద్ధ సంపద, యుద్ధ సంపద అని అరవడం మొదలుపెట్టారు. హజ్రత్ అబ్దుల్లాహ్ తన బృందాన్ని ఆపడానికి ప్రయత్నించారు. దైవ ప్రవక్త (స) తనను ఇక్కడి నుండి కదలవద్దని ఆదేశించారని వారికి గుర్తు చేశారు, కానీ వారు వినలేదు. ఎప్పుడైతే వారు ఆ కొండ కనుమను వదిలి యుద్ధ సంపద వైపు వెళ్లారో, అల్లాహ్ కూడా ఆ ముస్లింల నుండి తన ముఖాన్ని త్రిప్పుకున్నాడు. యుద్ధం గతి తప్పింది, శత్రువులు తిరిగి దాడి చేశారు మరియు డెబ్బై మంది ముస్లింలు అమరులయ్యారు. అప్పటికే దైవ ప్రవక్త (స) తన అనుచరులతో కలిసి కొండ దిగువన ఆశ్రయం పొంది ఉన్నారని చెబుతారు. అప్పుడు అబూ సుఫ్యాన్ ఒక ఎత్తైన ప్రదేశానికి చేరుకుని, "మీలో ముహమ్మద్ ఉన్నారా?" అని గట్టిగా అడిగాడు. దానికి సమాధానం ఇవ్వవద్దని ప్రవక్త (స) ఆదేశించారు. ఆ తర్వాత అతను, "మీలో ఇబ్న్ ఖుహాఫా (అబూ బకర్) ఉన్నారా?" అని అడిగాడు. ప్రవక్త (స) మళ్ళీ, "సమాధానం ఇవ్వకండి" అని చెప్పారు. అప్పుడు అతను, "మీలో ఇబ్న్ ఖత్తాబ్ (ఉమర్) ఉన్నారా?" అని అడిగాడు. ఎటువంటి సమాధానం రాకపోవడంతో, అబూ సుఫ్యాన్ "వీరందరూ చంపబడ్డారు. ఒకవేళ బతికే ఉంటే తప్పకుండా సమాధానం ఇచ్చేవారు" అని అన్నాడు. హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు తనను తాను నియంత్రించుకోలేక, గట్టిగా ఇలా అన్నారు: ఓ అల్లాహ్ శత్రువా! నీవు అబద్ధం చెబుతున్నావు. నిన్ను అవమానపరచడానికి అల్లాహ్ వారందరినీ సజీవంగానే ఉంచాడు.

అప్పుడు అబూ సుఫ్యాను హుబల్ (విగ్రహం) వర్ధిల్లాలి! అని నినదించాడు. అతను అలా అనగానే, దైవ ప్రవక్త(స) తట్టుకోలేకపోయారు. అతనికి సమాధానం ఇవ్వండని ఆదేశించారు. అనుచరులు మేము ఏమని సమాధానం ఇవ్వాలి? అని అడిగారు. దానికి మహా ప్రవక్త (స) అల్లాహ్ అత్యున్నతుడు, అత్యంత గొప్పవాడు అని చెప్పమన్నారు.

అప్పుడు అబూ సుఫ్యాన్ మాకు 'ఉజ్జా' (విగ్రహం) ఉంది, కానీ మీకు ఏ ఉజ్జా లేదని అన్నాడు. దైవ ప్రవక్త(స) మళ్ళీ అతనికి సమాధానం ఇవ్వండని చెప్పారు. అనుచరులు ఏమని చెప్పాలి?అని అడగగా మహా ప్రవక్త (స) ఇలా అన్నారు: అల్లాహ్ మాకు సహాయకుడు, కానీ మీకు ఎవరూ సహాయకుడు లేరు.

(సహి బుఖారి, కితాబుల్ ముఘాజి, బాబ్ ఘజ్వతి ఉహద్, హదీస్ 4043)

అంటే ఎక్కడైతే అల్లాహ్ గౌరవం, అతని పట్ల ప్రేమకు సంబంధించిన ప్రశ్న తలెత్తిందో, అక్కడ మహా ప్రవక్త (స) తన ప్రాణాలను కూడా లెక్కచేయలేదు. అంతకుముందు వ్యూహాత్మక కారణాల వల్ల సమాధానం ఇవ్వకూడదని భావించినప్పటికీ దైవ గౌరవానికి భంగం కలగడం వలన వెంటనే సమాధానం ఇవ్వమని అనుచరులను ఆదేశించారు.

చరిత్ర ఆధారంగా హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) గారిలా వ్రాశారు: శత్రువుల దాడి కారణంగా వెనక్కి నెట్టబడిన అనుచరులు, శత్రువులు కొంచెం వెనక్కి తగ్గగానే తిరిగి దైవ ప్రవక్త (స) చుట్టూ చేరుకున్నారు. ప్రవక్త (స) గాయాల వల్ల స్పృహ తప్పి పడిపోయారు, అనుచరులు ఆయనను లేవనెత్తారు. హజ్రత్ అబూ ఉబైదా బిన్ జర్రాహ్ (రజి) తన పళ్ళతో ప్రవక్త (స) తలలో గుచ్చుకున్న ఇనుప ముక్కలను బలంగా లాగి తీశారు, ఆ ప్రయత్నంలో ఆయన రెండు పళ్ళు విరిగినవి. కొంత సమయం తర్వాత దైవ ప్రవక్త (స)కి స్పృహ వచ్చింది. మహా ప్రవక్త (స) సజీవంగా ఉన్నారనే వార్తను తెలియజేయడానికి అనుచరులు మైదానం మొత్తం మనుషులను పంపారు, ఎందుకంటే మహా ప్రవక్త (స) అమరులయ్యారని శత్రువులు పుకారు పుట్టించారు. దీంతో చెల్లాచెదురైన ముస్లిం సైన్యం మళ్ళీ ఏకం కావడం ప్రారంభమైంది. దైవ ప్రవక్త(స) తన అనుచరులతో కలిసి కొండ దిగువకు చేరుకున్నారు. అప్పుడు అబూ సుఫ్యాన్ బిగ్గరగా మేము ముహమ్మద్‌ను చంపేశాము! అని అరిచాడు. శత్రువులకు అసలు

విషయం తెలిసి మళ్ళీ దాడి చేస్తారేమోనన్న ఉద్దేశంతో ప్రవక్త (స) దానికి సమాధానం ఇవ్వవద్దని ఆజ్ఞాపించారు. ముస్లింలు గాయపడిన స్థితిలో ఉన్నందున, శత్రువుల మరో దాడిని తట్టుకోవడం కష్టమవుతుందని ఆయన భావించారు. ముస్లింల నుండి ఎటువంటి సమాధానం రాకపోవడంతో అబూసుఫ్యాన్ తన అంచనా నిజమని నమ్మాడు. అతను మళ్ళీ బిగ్గరగా మేము అబూబకర్‌ను కూడా చంపేశాము! అని అరిచాడు. మహా ప్రవక్త (స) హ్రజత్ అబూబకర్‌ను కూడా మౌనంగా ఉండమని కోరారు. ఆ తర్వాత అబూ సుఫ్యాన్ మేము ఉమర్‌ను కూడా చంపేశాము! అని అరవగా, రోషం గల హ్రజత్ ఉమర్ (రజి) మేము అల్లాహ్ దయతో సజీవంగా ఉన్నామని చెప్పాలనుకున్నారు, కానీ మహా ప్రవక్త (స)ముస్లింలను కష్టాల్లో నెట్టవద్దు, మౌనంగా ఉండని వారించారు. ఇస్లాం స్థాపకుడిని, ఆయన కుడి ఎడమ భుజాల వంటి వారిని చంపేశామని నమ్మిన అబూ సుఫ్యాన్ అతని సహచరులు సంతోషంతో మా గౌరవనీయ విగ్రహం 'హుబల్' ఘనత వర్ధిల్లాలి, అది ఇస్లాంను అంతం చేసిందని నినదించాడు. తమ మరణ వార్తలపై అనుచరులను మౌనంగా ఉండమని కోరిన అదే దైవ ప్రవక్త(స) ఎప్పుడైతే అల్లాహ్ గౌరవం, ఏకేశ్వరోపాసన (తౌహీద్) ప్రశ్న తలెత్తిందో, ఎప్పుడైతే బహుదైవారాధన నినాదం వినిపించిందో, అప్పుడు ఆయన ఆత్మ తల్లడిల్లిపోయింది. ఆయన ఎంతో ఆవేశంతో అనుచరులను చూసిమీరు ఎందుకు సమాధానం ఇవ్వడం లేదు?అని అడిగారు. అనుచరులు ఓ అల్లాహ్ ప్రవక్త! మేము ఏమని చెప్పాలి?" అని అడగగా, ప్రవక్త (స) ఇలా అన్నారు: అల్లాహ్ అత్యున్నతుడు, అత్యంత గొప్పవాడు! హుబల్ ఘనత పెరిగిందని మీరు అబద్ధం చెబుతున్నారు. అల్లాహ్ ఒక్కడే గౌరవనీయుడు, అతని ఘనత మాత్రమే అత్యున్నతమైనది, హుబల్ ది కాదు! అని గర్జించారు. ఈ విధంగా దైవ ప్రవక్త (స) తాను సజీవంగా ఉన్నాననే వార్తను స్వయంగా శత్రువులకు తెలియజేశారు.

ఈ ధైర్యవంతమైన, వీరోచితమైన సమాధానం అవిశ్వాసుల సైన్యంపై ఎంతటి లోతైన ప్రభావాన్ని చూపినదంటే, వారి ఆశలన్నీ అప్పటికప్పుడు మట్టిలో కలిసిపోయాయి. భౌతిక చట్టాల ప్రకారం, వారి ముందు నిలబడి ఉన్న ఆ కొద్దిపాటి గాయపడిన ముస్లింలపై దాడి చేసి వారిని అంతం చేయడం సులభమే అయినప్పటికీ, ముస్లింల ఆ గర్జన విని వారు తిరిగి దాడి చేసే ధైర్యం చేయలేకపోయారు. తమకు లభించిన కొద్దిపాటి విజయంతోనే సంతృప్తి చెంది, సంబరాలు చేసుకుంటూ మక్కాకు తిరిగి వెళ్లిపోయారు. (దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పేజి 252-253)

దైవ ప్రవక్త(స) అల్లాహ్ పట్ల తనకున్న ప్రేమలో బహుదైవారాధన చిన్న ఛాయను కూడా సహించేవారు కాదు.

హ్రజత్ ఇబ్న్ అబ్బాస్ (రజి) ఉల్లేఖించిన ఒక కథనం ప్రకారం: ఒక వ్యక్తి దైవ ప్రవక్త(స)తో, "అల్లాహ్ మరియు మీరు (ప్రవక్త) ఏది కోరుకుంటే అది జరుగుతుంది" అని అన్నాడు. అప్పుడు దైవ ప్రవక్త(స) ఇలా ప్రశ్నించారు: "ఏమిటి, నీవు నన్ను అల్లాహ్‌తో సమానంగా నిలబెట్టావా? అలా అనకు, 'అల్లాహ్ ఒక్కడే ఏది కోరుకుంటే అది జరుగుతుంది' అని చెప్పు."

(సునన్ ఇబ్నే మాజా, కితాబుల్ కఫారాత్ ... హదీస్ 2117)

అంటే, అన్యారాధన స్వల్ప అంశం కూడా మాటల్లో రాకూడదు. కొందరు ప్రజలు అనుకోకుండా "అల్లాహ్ మరియు మీరు కోరుకుంటే" అని అంటుంటారు. అయితే, "అల్లాహ్ కోరుకుంటే మరియు అల్లాహ్ అనుగ్రహం ఉండి, ప్రవక్త గారి దువా కూడా తోడైతే శుభం కలుగుతుంది" అని చెప్పవచ్చు. దువా వరకు అది సరైనదే, కానీ "ప్రవక్త కోరుకుంటే" అని అల్లాహ్‌తో సమానంగా చెప్పడం తప్పు, ఎందుకంటే దైవ ప్రవక్త(స) దీనిని కఠినంగా వ్యతిరేకించారు.

దైవ ప్రవక్త(స) తన మరణానంతరం ప్రజలు తన సమాధిని ఆరాధనా స్థలంగా మారుస్తారేమో అని ఎప్పుడూ ఆందోళన చెందేవారు. కానీ దురదృష్టవశాత్తూ, నేడు దానికి విరుద్ధంగా జరుగుతోంది. ముస్లింలు పీర్లు, ఫకీర్ల సమాధుల వద్దకు వెళ్లి వాటిని పూజిస్తున్నారు, అక్కడ సజ్దాలు (సాష్టాంగ నమస్కారాలు) చేస్తున్నారు. వాస్తవానికి, సమాధులను మసీదులుగా మార్చవద్దని ప్రవక్త (స) ఖచ్చితంగా వారించారు. హ్రజత్ ఆయిషా (రజి) ఉల్లేఖించిన కథనం ప్రకారం: దైవ ప్రవక్త(స) తన మరణానికి ముందు (చివరి అనారోగ్య సమయంలో) ఇలా అన్నారు: యూదులు, క్రైస్తవులపై అల్లాహ్ శాపం ఉండుగాక! వారు తమ ప్రవక్తల సమాధులను మసీదులుగా (ఆరాధనా స్థలాలుగా) మార్చుకున్నారు. హ్రజత్ ఆయిషా (రజి) ఇట్లనిరి. వారిలా చెప్పని యెడల వారి సమాధి తెరిచే ఉంచబడేది. అలాంటప్పుడు దానిని మస్జిద్ గా మార్చుకుంటారని నేను భయపడుతున్నాను. ఏది ఏమైనప్పటికి దానిని ఆరాధనా స్థలంగా మార్చు కోకుండా దానిని మూసివేశారు.

(సహీ బుఖారి కితాబుల్ జనాయిజ్, బాబ్ మాయుక్రవు మినిత్తిఖాజిల్ మస్జిద్ అలల్ ఖుబూరి, హదీస్ 1330)

నేడు అక్కడి (మదీనా) ప్రభుత్వం మహా ప్రవక్త (స) సమాధి చుట్టూ క్రమబద్ధమైన ఏర్పాట్లు చేసింది. అక్కడ ఇనుప కంచెలు, గోడలు నిర్మించారు, తద్వారా ఎటువంటి బహుదైవారాధన జరగకుండా అడ్డుకుంటున్నారు. కనీసం ఈ విషయంలో వారు మంచి పని చేశారు, ఎందుకంటే దైవ ప్రవక్త(స) కి అన్యారాధన అంటే తీవ్రమైన అసహ్యం ఉండేది.

అల్లాహ్ ఏకత్వం గురించి ఒక కథనం ఇలా ఉంది: హ్రజత్ ఇబ్న్ అబీ కాబ్ (రజి) ఉల్లేఖనం ప్రకారం అన్యారాధకులు దైవ ప్రవక్త(స) ని కలిసి మీ ప్రభువు వంశావళి మాకు చెప్పండని అడిగారు. దానికి సమాధానంగా అల్లాహ్ ఈ క్రింది అధ్యాయాన్ని పంపాడు: قُلْ هُوَ اللّٰهُ اَحَدٌ۔ اَللّٰهُ الصَّمَدُ అనగా ఓ ప్రవక్తా! (ఇతర మానవులతో) ఇట్లనుచుండుము విషయమేమనగా అల్లాహ్ ఒక్కడే. అందరి అవసరాలను తీర్చువాడే అల్లాహ్ (అతనికెవరి సహాయము అవసరం లేదు).ఎందుకంటే పుట్టిన ప్రతిదీ మరణిస్తుంది, మరణించిన ప్రతిదానికీ వారసులు ఉంటారు. కానీ వైభవంతుడైన అల్లాహ్ ఎప్పటికీ మరణించడు, ఆయనకు ఎవరూ వారసులు ఉండరు, అతనికి సాటివారెవరూ లేరు. కథకులు వివరిస్తూ, అతనికి పోలిక ఉన్నవారు కానీ, సమానమైన వారు కానీ, అతని వంటి వారు కానీ ఎవరూ లేరని తెలిపారు.

(سنن الترمذی أَبْوَابُ تَفْسِيرِ الْقُرْآنِ عَنْ رَسُولِ اللهِ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ بَابٌ: وَمِنْ سُورَةِ الإِخْلَاصِ حدیث 3364)

దైవ ప్రవక్త(స) దైవ ఏకత్వాన్ని ప్రస్తావించే ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదిలి పెట్టేవారు కాదు. ఆయన పలికే ప్రతి మాట నుండి అల్లాహ్ పట్ల ఉన్న అమితమైన ప్రేమ వ్యక్తమయ్యేది. ప్రతి సందర్భంలోనూ ఆయన మాట్లాడినప్పుడు, ఆయన హృదయం దైవప్రేమతో నిండిపోయి ఉందన్న విషయం స్పష్టంగా తెలిసేది. వాస్తవానికి, ఆయన హృదయం దైవప్రేమతో ఎంతగా నిండిపోయిందంటే, అక్కడ ఆ ప్రేమ తప్ప మరేమీ ఉండేది కాదు.

హ్రజత్ జైద్ బిన్ ఖాలిద్ జుహనీ (రజి) ఇలా వివరించారు: దైవ ప్రవక్త(స) హుదైబియాలో రాత్రి కురిసిన వర్షం తర్వాత మాకు ఫజర్ నమాజ్ చేయించారు. నమాజ్ ముగిసిన తర్వాత ఆయన ప్రజల వైపు తిరిగి, 'మీ ప్రభువు (అల్లాహ్) ఏమన్నాడో మీకు తెలుసా?' అని అడిగారు. అల్లాహ్‌కు హృదయాల స్థితి తెలుసు. వర్షాన్ని చూసి ప్రజలు ఏమనుకుంటున్నారో అల్లాహ్‌కు ముందే తెలుసు, ఆ విషయాన్నే అతడు ప్రవక్త (స) కు తెలియజేశాడు. అనుచరులు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకే బాగా తెలుసునని విన్నవించారు. అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: అల్లాహ్ ఇలా అంటున్నాడు: నా దాసులలో కొందరు నాపై విశ్వాసం కలిగిన వారుగా ఈ ఉదయాన్ని ప్రారంభించారు, మరికొందరు నన్ను తిరస్కరించే వారుగా ప్రారంభించారు. ఎవరైతే అల్లాహ్ అనుగ్రహం మరియు అతని కరుణ వల్ల మాకు వర్షం కురిసింది అని అన్నారో, వారు నాపై విశ్వాసం ఉంచినట్లు మరియు నక్షత్రాల ప్రభావాన్ని తిరస్కరించినట్లు లెక్క. ఆ కాలంలో నక్షత్రాలను పూజించే ఆచారం ఉండేది. ప్రజలకు సరైన అవగాహన తక్కువగా ఉండేది. ఇస్లాంలోకి కొత్తగా వచ్చిన కొందరు, ఫలానా నక్షత్రం వల్ల ఈరోజు వర్షం పడిందని అనేవారు. కాబట్టి ఎవరైతే నక్షత్రాల వల్ల వర్షం పడిందని అంటారో, వారు అల్లాహ్‌ను తిరస్కరించి, నక్షత్రాలను విశ్వసించినట్లేనని హెచ్చరించారు.

(صحیح البخاری کتاب الاذان بَابٌ يَسْتَقْبِلُ الإِمَامُ النَّاسَ إِذَا سَلَّمَ حدیث 846)

అనంతరం అల్లాహ్ తన ప్రవక్త (స) తో ఇలా అన్నాడు: ఓ ముహమ్మద్ (స)! నీవు అల్లాహ్ ఏకత్వాన్ని ఎంత పరిపూర్ణంగా అవగాహన చేసుకున్నావో, అలాగే నీ అనుచరులకు కూడా వివరించు. ప్రతి విషయంలోనూ దైవ ఏకత్వాన్ని అతనికి పట్ల ప్రేమని ఎంతటి సూక్ష్మంగా చాటి చెప్పాలో, హృదయపు లోతుల్లోంచి దానిని ఎలా విశ్వసించాలో వారికి బోధించు.

హ్రజత్ జాబిర్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించిన కథనం ప్రకారం: ఒక వ్యక్తి దైవ ప్రవక్త(స) వద్దకు వచ్చి, ఓ అల్లాహ్ ప్రవక్త! స్వర్గం మరియు నరకం ని ఖరారు చేసే ఆ రెండు విషయాలు ఏమిటి?" అని అడిగారు. దానికి మహా ప్రవక్త (స) ఇలా సమాధానం ఇచ్చారు: ఎవరైతే అల్లాహ్‌కు మరొకరిని సాటికల్పించకుండా (అన్యారాధన చేయకుండా) మరణిస్తారో, వారు స్వర్గంలో ప్రవేశిస్తారు. మరియు ఎవరైతే అల్లాహ్‌కు సాటికల్పిస్తూ మరణిస్తారో, వారు నరకాగ్నిలో ప్రవేశిస్తారు.

(صحیح المسلم کتاب الایمان باب: الدليل على من مات لا يشرك بالله شيئًا دخل الجنة ...... حدیث نمبر: 93)

నేడు కూడా 'అన్యారాధన' అంటే ఏమిటి? అని ప్రశ్నించే ప్రతి ఒక్కరికి ఈ సమాధానం సరిపోతుంది.

హ్రజత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం వివరించినట్లుగా: వనరులపై భరోసా, తనపై తనకున్న నమ్మకం, తన యోగ్యతపై నమ్మకం, తన సంపదపై, తన వంశం మరియు తెగపై, తన సంతానంపై భరోసా సంక్షిప్తంగా చెప్పాలంటే, మనిషి అల్లాహ్‌ను ప్రథమ స్థానంలో ఉంచకుండా, అల్లాహ్ పేరు స్మరించకుండా ఏ వస్తువుపై భరోసా ఉంచినా, అది అన్యారాధన కిందకే వస్తుంది.

**(మల్ఫూజాత్ సంపుటి 2, పేజి 420, ముద్రణ 2022)**

కాబట్టి, మనం అన్యారాధన నుండి రక్షించబడటానికి, అల్లాహ్ ప్రేమను హృదయంలో పెంచుకోవడానికి ఈ సూక్ష్మ కోణంలో మనల్ని మనం పరిశీలించుకోవాలి.

మహా ప్రవక్త (స) మరో సందర్భంలో మరింత సూక్ష్మంగా ఇలా తెలిపారు.

మహ్మూద్ బిన్ లబీద్ కథనం ప్రకారం దైవ ప్రవక్త(స) ఇలా అన్నారు: మీ విషయంలో నేను అత్యంత ఎక్కువగా భయపడేది చిన్న అన్యారాధన గురించి. అనుచరులు ఓ అల్లాహ్ ప్రవక్త! చిన్నఅన్యారాధన అంటే ఏమిటి?" అని అడిగారు. దానికి ఆయన, ప్రదర్శనకారితనం (లోకులకు చూపించుకోవడం) అని సమాధానం ఇచ్చారు. ప్రళయ దినం రోజున అల్లాహ్ ఇలా అంటాడు: మీరు ప్రపంచంలో ఎవరిని మెప్పించడానికి పనులు చేసేవారో, ఎవరికైతే చూపించుకునే వారో, వారి వద్దకే వెళ్ళండి; అక్కడ మీకు ఏదైనా ప్రతిఫలం దొరుకుతుందేమో చూడండి. మీరు వారి కోసమే కదా పనులు చేసింది, ఇప్పుడు వారి నుండే ప్రతిఫలం తీసుకోండి.

(مسند الامام احمد بن حنبل جلد 7 صفحہ 799 حدیث محمود بن لبید حدیث: 24030 مکتبہ عالم الکتب بیروت)

అంటే, లోకులకు చూపించుకోవడం కోసం చేసే కృత్రిమ పద్ధతులు, ప్రదర్శన బుద్ధి అల్లాహ్‌కు అస్సలు నచ్చవు. ఎందుకంటే ఆ పనులు అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకోవడానికి కాకుండా, మనుషులను మెప్పించడానికి చేయబడ్డాయి.

ఇంత క్షుణ్ణముగా మన కర్మలను మనం సమీక్షించుకోవాలి, ఎందుకంటే పరలోకంలో అల్లాహ్ అనుగ్రహం తప్ప మరేదియును పనికిరాదు. చివరికి, అల్లాహ్ ఇష్టపడేది దైవ ప్రవక్త(స) సున్నత్‌ను అనుసరించడం, ఆయనకు విధేయులై ఉండటమే.

అందుకే అల్లాహ్ స్వయంగా ఇలా ప్రకటించాడు: ఫత్తబిఊని యుహ్‌బిబ్‌కుముల్లాహ్ (ఆలే ఇమ్రాన్:32) అనగా: ఓ ప్రవక్త! మీరు చెప్పండి: మీరు నన్ను అనుసరించండి, అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు.

మరొక హదీసులో ఇట్లు గలదు. హజ్రత్ అబూ హురైరా రజియల్లాహు అన్హు ఉల్లేఖించిన కథనం ప్రకారం, దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: వైభవంతుడైన అల్లాహ్ తన మార్గంలో బయలుదేరిన వ్యక్తికి ఈ బాధ్యతను తనపై ఉంచుకున్నాడు: నేను అతడిని అతను పొందిన ప్రతిఫలం లేదా యుద్ధ సంపదతో సురక్షితంగా తిరిగి ఇంటికి చేరుస్తాను లేదా అతడిని జన్నత్ (స్వర్గం)లో ప్రవేశింపజేస్తాను.అంటే, అయితే విజయం లభిస్తుంది లేదా అమరత్వం లభిస్తే స్వర్గం లభిస్తుంది. కానీ దీనికి నిబంధన ఏమిటంటే అతను కేవలం నాపై ఉన్న విశ్వాసం, నా ప్రవక్తల సత్యతను ధ్రువీకరించడం కోసమే యుద్ధానికి బయలుదేరి ఉండాలి. అంటే విశ్వాసం బలంగా ఉండాలి, అల్లాహ్ ప్రవక్త విధేయతను, బైఅత్ (ప్రమాణం) హక్కును నెరవేరుస్తూ బయలుదేరాలి. మహా ప్రవక్త (స) ఇంకా ఇలా అన్నారు:నా ఉమ్మత్‌ను కష్టాల్లో నెట్టేస్తానన్న భయం నాకు లేకపోతే, నేను ప్రతి సైనిక దళంతో కలిసి స్వయంగా వెళ్ళేవాడిని. అల్లాహ్ మార్గంలో నేను వీరమరణం పొందాలని, మళ్ళీ బ్రతికించబడాలని, తిరిగి చంపబడాలని, మళ్ళీ బ్రతికించబడాలని, మరొక్కసారి చంపబడాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. దైవ ప్రవక్త(స) ఈ విధంగా అల్లాహ్ మార్గంలో ప్రాణత్యాగం పట్ల తనకున్న అమితమైన ఆకాంక్షను మరియు దైవ ప్రేమను వ్యక్తం చేశారు.

(صحیح البخاری کتاب الایمان باب الجھاد من الایمان حدیث 36)

హజ్రత్ సయ్యద్ వలియుల్లా షా గారు ఈ హదీసును వివరిస్తూ ఇలా వ్రాశారు: బుఖారీ కథనం ప్రకారం, దైవ ప్రవక్త(స) “లౌలా అన్ అషుఖ్ఖ అలా ఉమ్మతి ” అనగా నా ఉమ్మత్‌కు కష్టం కలుగుతుందన్న భయం లేకపోతే నేను ఇలా చేసేవాడిని అని అనడంలో ఒక గొప్ప అర్థం ఉంది. సహాబాలకు తనను అనుసరించాలనే అమితమైన తపన ఉందని ప్రవక్త (స) కి తన అనుభవంతో తెలుసు. ఆయన ఆచరణలో ఎంతటి ఆకర్షణ, ప్రభావం ఉండేదంటే, ఏదైనా పని చేసేటప్పుడు తన అనుచరుల గురించి ఆయన ఆలోచించాల్సి వచ్చేది. తాను చేసే ప్రతి పనిని వారు అనుసరిస్తారని, దానివల్ల వారు అనవసరమైన ఇబ్బందుల్లో లేదా కష్టాల్లో పడకూడదని ఆయన భావించేవారు. అందుకే, మీరు కష్టపడకూడదనే ఉద్దేశంతోనే నేను కొన్నిసార్లు యుద్ధ దళాలతో వెళ్ళడం లేదని ఆయన సెలవిచ్చారు. సయ్యద్ వలియుల్లా షా సాహెబ్ ఇంకా ఇలా వ్రాశారు: దైవ ప్రవక్త(స) కి అల్లాహ్ పట్ల అపారమైన ప్రేమ ఉండేది. చివరకు శత్రువులు కూడా ఆయనను ‘ముహమ్మద్ తన ప్రభువు ప్రేమలో పడిపోయారు’ అని అనేవారు. అయితే ఆ ప్రేమతో పాటు ఆయనకు తనపై పరిపూర్ణమైన నియంత్రణ ఉండేది. వివేకం ఆయనను ఒక్క క్షణం కూడా వదలలేదు. తమ పనుల్లో అతిగా ప్రవర్తించే వారికి ఇందులో ఒక గొప్ప పాఠం ఉంది. కేవలం భావోద్వేగాల వెంటే వెళ్ళడం అనేది పరిపూర్ణ విశ్వాసానికి గుర్తు కాదు. అది గొప్ప పుణ్యం కూడా కాదు. కొందరు ప్రజలు మాకు పౌరుషం ఉంది, మేము అది చేయాలి, ఇది చేయాలి” అని అంటుంటారు. కానీ అల్లాహ్ సమతుల్యతను ఇష్టపడతాడు. మధ్యేమార్గంలో నిలకడగా ఉండటమే పుణ్యపు పరిపూర్ణత. ఎందుకంటే ఇందులో తన మనసు͙తో పోరాడాలి͙ ఉంటుంది.

(صحیح البخاری مترجم اردو جلد 1 صفحہ 84، کتاب الایمان باب الجھاد من الایمان حدیث 36۔ نظارت اشاعت ربوہ)

ఇక్కడ ఒకవైపు దైవప్రేమ ఉంది, మరోవైపు విజ్ఞతతో కూడిన ఆత్మనిగ్రహం ఉంది. ఈ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని పనిచేయాలి తప్ప, గుడ్డిగా వెళ్ళకూడదు.

దైవ ప్రవక్త(స) తన ఆచరణ ద్వారా మనకు ఒక అద్భుతమైన మార్గాన్ని చూపారు. అక్కడ దైవప్రేమకు అంతం లేదు, త్యాగానికి హద్దు లేదు, కానీ అదే సమయంలో వివేకం, సమతుల్యమైన మార్గం కూడా ఉంది. ఎందుకంటే ఆ సమతుల్య మార్గాన్ని అనుసరించమని అల్లాహ్ స్వయంగా ఆజ్ఞాపించాడు.

దైవ ప్రవక్త (స) బహుదైవారాధకుల నుండి సహాయం పొందడాన్ని ఎంతగానో అసహ్యించుకునే వారు. దీనికి సంబంధించిన ఒక కథనం హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ద్వారా ఈ విధంగా ఉంది: దైవ ప్రవక్త(స) బదర్ యుద్ధం కోసం బయలుదేరినప్పుడు, మదీనాకు పశ్చిమాన మూడు మైళ్ళ దూరంలో ఉన్న హర్రతుల్ వబ్రాఅనే ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ ఆయనకు ఒక వ్యక్తి కలిశాడు. అతను తన ధైర్యసాహసాలకు చాలా పేరుగాంచిన వాడు. అతన్ని చూసి అనుచరులెంతో సంతోషించారు, ఎందుకంటే అతను తమతో కలిసి యుద్ధంలో పాల్గొంటాడని వారు భావించారు. ఆ వ్యక్తి మహా ప్రవక్త (స) వద్దకు వచ్చి నేను మీతో పాటు వచ్చి, ఈ యుద్ధంలో పాల్గొని మీకు సహాయం చేయాలనుకుంటున్నానని అన్నాడు. అప్పుడు దైవ ప్రవక్త(స) అతనిని, నీవు అల్లాహ్, అతని ప్రవక్తపై విశ్వాసం కలిగి ఉన్నావా?అని అడిగారు. అతను లేదు అని సమాధానమిచ్చాడు. దానికి దైవ ప్రవక్త (స), అయితే తిరిగి వెళ్ళిపో, ఎందుకంటే నేను ఏ అన్యారాధకుని నుండి సహాయం తీసుకోనని స్పష్టంగా చెప్పారు. హజ్రత్ ఆయిషా (రజి) ఇంకా ఇలా వివరించారు: “ఆ వ్యక్తి వెనుదిరిగి వెళ్ళిపోయాడు. మేము మదీనా నుండి ఏడు మైళ్ళ దూరంలో ఉన్న షజ్రా (జుల్-హులేఫాలోని ఒక చెట్టు) వద్దకు చేరుకున్నప్పుడు, అతను మళ్ళీ వచ్చి అదే విషయాన్ని అడిగాడు. ప్రవక్త (స) మళ్ళీ మునుపటిలాగే ‘తిరిగి వెళ్ళిపో’ అని చెప్పారు. ఆ తర్వాత అతను ‘బైదా’ అనే ప్రదేశం వద్ద మూడవసారి ప్రవక్త (స) ని కలిసి, తన అభ్యర్థనను కోరాడు. అప్పుడు ప్రవక్త (స), నీవు అల్లాహ్, అతని ప్రవక్తపై విశ్వాసాన్ని కలిగి ఉన్నావా?’ అని అడగగా, అతను ‘అవును’ అని సమాధానమిచ్చాడు. అప్పుడు ప్రవక్త (స), ‘సరే, ఇప్పుడు నువ్వు మాతో రావచ్చు’ అని అనుమతించారు .దీని ద్వారా మనకు తెలిసే విషయం ఏమిటంటే, పరిస్థితులు ఎలా ఉన్నా, అల్లాహ్ పట్ల ఉన్న ప్రేమ, ఆత్మాభిమానం అన్యారాధకుల సహాయాన్ని అంగీకరించకూడదు. ముఖ్యంగా అల్లాహ్ సంతృప్తి కోసం, ధర్మం కోసం చేసే పనులలో పూర్తిగా దైవ విశ్వాసంపైనే ఆధారపడాలి.

(صحیح المسلم کِتَابُ الْجِهَادِ وَالسِّيَرِ بَابُ كَرَاهَةِ الِاسْتِعَانَةِ فِي الْغَزْوِ بِكَافِرٍ ……حدیث 1817) (فرہنگ سیرت صفحہ 71، صفحہ 102، صفحہ 105، صفحہ 162)

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు ఇలా వివరించారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను చూడండి, ఆయనకు దైవం పట్ల ఎంతటి అవగాహన ఉండేదో, ఆయన ఎంతటి జాగ్రత్త వహించేవారో! ఆయన అల్లాహ్ పట్ల ఎంతటి భయభక్తులు కలిగి ఉండేవారో గమనించండి. మానవులందరి కంటే పరిపూర్ణులైనప్పటికీ, సర్వ పాపాలకు అతీతులైనప్పటికీ, అల్లాహ్ స్వయంగా ఆయనకు రక్షకుడిగా, సంరక్షకుడిగా ఉన్నప్పటికీ, అట్టి పవిత్రత, నిర్మలత్వం ఉన్నా సరే, ఆయన స్థితి ఎలా ఉండేదంటే, ప్రతిక్షణం అల్లాహ్‌కు భయపడుతూ ఉండేవారు.ఆయన ఒక పుణ్యం తర్వాత మరొక పుణ్యం చేస్తూ ఉండేవారు, అత్యున్నతమైన కర్మలను ఆచరించేవారు. ఒక పుణ్య పని తర్వాత మరో పుణ్యపని చేస్తూ ముందుకు సాగేవారు. ఆయన విషయంలో చెడు అనే మాటే పుట్టదు, దాని ఛాయ కూడా ఉండేది కాదు. ఆయన నిరంతరం దైవారాధనలో నిమగ్నమై ఉండేవారు. అయినప్పటికీ, ఆయన అల్లాహ్‌కు ఎంతో భయపడేవారు. తన వంతుగా సాధ్యమైనంత వరకు జాగ్రత్త వహించేవారు, కానీ అల్లాహ్ నిరపేక్షత, అతని ఘనతను చూసినప్పుడు, దైవ ఆ సమున్నత దర్బారులో తన కర్మలన్నింటినీ ఏమీ లేనివిగా భావించి, వాటి నుండి వైదొలిగి, క్షమాపణ వేడుకునేవారు, అవకాశం దొరికినప్పుడల్లా తౌబా (పశ్చాత్తాపం) చేసేవారు. హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు: “ సమిఅతు న్నబియ్య సల్లల్లాహు అలైహి వసల్లమ యఖూలు వల్లాహి ఇన్ని లఅస్తఘ్ఫిరుల్లాహ వ అతూబు ఇలైహి ఫిల్ యౌమి అక్‌సర మిన్ సబ్‌ఈన మర్రతన్” ఇది బుఖారికి చెందిన హదీస్. అనగా నేను దైవ ప్రవక్త(స) ఇలా పఠించడం విన్నాను: అల్లాహ్ ప్రమాణంగా! నేను రోజుకు డెబ్బై కంటే ఎక్కువ సార్లు అల్లాహ్ సన్నిధిలో క్షమాపణ కోరుకుంటాను, అతని వైపునకు మళ్లుతాను.

**(సీరతున్నబియ్యి సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి సంపుటి 1, పేజి 82)**

అరబిక్ భాషలో డెబ్బైఅనే పదాన్ని తరచుగా అసంఖ్యాకమైన లేదా లెక్కలేనన్నిసార్లు అనే అర్థంలో కూడా ఉపయోగిస్తారు. అంటే ఆయన లెక్కలేనన్ని సార్లు ఈ విధంగా చేసేవారని అర్థం.

అల్లాహ్ పట్ల ఆయనకు ఉన్న ప్రేమ ఎంతటిదంటే, ప్రతి సందర్భంలోనూ ఆయన పవిత్ర నాలుక దైవస్మరణతో తడిసి ఉండేది.

హజ్రత్ ఆయిషా (రజి) వివరించినట్లుగా, దైవ ప్రవక్త(స) ప్రతి స్థితిలోనూ అల్లాహ్‌ను స్మరించేవారు.

**(సునన్ తిర్మిజి, అబువాబు ద్దావత్, బాబ్ మాజాఅ అన్ దావతుల్ ముస్లిము ముస్తజాబతు హదీస్ 3384)**

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) గారు వివరించినట్లుగా, అనేక హదీసుల ద్వారా నిరూపితమైనట్లుగా, ఆయన నాలుక ఎల్లప్పుడూ దైవస్మరణతో నిండి ఉండేది. హజ్రత్ సమ్రా బిన్ జుందుబ్ (రజి) ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: నాలుగు మాటలు అన్ని మాటల కంటే అత్యంత శ్రేష్ఠమైనవి. వీటిలో దేనితోనైనా నీవు ప్రారంభించవచ్చు, దానివల్ల నీకు ఎటువంటి నష్టం ఉండదు. ఇవి అత్యంత పుణ్య ప్రదమైనవి మరియు శుభం కలిగించే మాటలు: ఒకటి సుబ్హానల్లాహ్ అనగా అల్లాహ్ పరమ పవిత్రుడు. రెండవది అల్హందులిల్లాహ్ అనగా సర్వ స్తోత్రాలు అల్లాహ్ కే దక్కుతాయి. మూడవది లా ఇలాహ ఇల్లల్లాహ్ అనగా అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు. నాలుగవది అల్లాహు అక్బర్ అల్లాహ్ అందరికంటే గొప్పవాడు.

**(సునన్ ఇబ్నే మాజా, కితాబుల్ అదబ్, బాబ్ ఫజలు తస్బీ హదీస్ 3811)**

ఈ విషయాలు మనిషి మనస్సులో ఎల్లప్పుడూ ఉండి, మాటల్లో లేదా పనుల్లో వీటిని పాటిస్తే, జీవితంలో ఎంతో శుభం కలుగుతుంది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ బిసర్ (రజి) ఇలా ఉల్లేఖించారు. ఒక గ్రామీణుడు దైవ ప్రవక్త(స)వద్దకు వచ్చి ఇలా విన్నవించాడు: ఓ అల్లాహ్ ప్రవక్త! ఇస్లాం నియమాలు, పుణ్యకార్యాలు నా కోసం చాలా ఎక్కువైపోయాయి (అంటే నేను వాటన్నింటినీ గుర్తుంచుకోలేకపోతున్నాను). కాబట్టి, నాకు ఏదైనా ఒక ముఖ్యమైన విషయం చెప్పండి, నేను దానిని గట్టిగా పట్టుకుంటాను, ఎల్లప్పుడూ అదే చేస్తాను. దానికి దైవ ప్రవక్త(స) ఇలా సమాధానం ఇచ్చారు:

లాయజాలు లిసానుక రత్‌బన్ మిన్ జిక్‌రిల్లాహి అజ్జవజల్లా.

అనగా: నీ నాలుక నిరంతరం అల్లాహ్ స్మరణతో తడిసి ఉండాలి.

(సునన్ ఇబ్నే మాజాకితాబుల్ అదబ్‌బాబ్ ఫజులిజ్జికర్ హదీస్ 3793)

మరో కథనంలో హజ్రత్ జాబిర్ (రజి) ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: అన్ని స్మరణలలో అత్యంత శ్రేష్ఠమైనది ‘లా ఇలాహ ఇల్లల్లాహ్’ మరియు అన్ని ప్రార్థనలలో అత్యంత శ్రేష్ఠమైనది ‘అల్హందులిల్లాహ్’.

**(సునన్ తిర్మిజి, అబ్‌వాబుద్దావత్, బాబ్ మాజాఅ అన్ దావతుల్ ముస్లిమ్ ముస్తజాబతు హదీస్ 3383)**

హజ్రత్ అబూ ఉమామా (రజి) ఉల్లేఖించిన ఒక హదీసులో ప్రవిత్ర ప్రవక్త(స) ఇలా వివరించారు: అల్లాహ్ నా ముందు ఒక ప్రతిపాదన ఉంచాడు. మక్కాలోని బత్హా లోయను నా కోసం బంగారంగా మారుస్తానని చెప్పాడు. అప్పుడు నేను ఇలా

విన్నవించాను: ఓ నా ప్రభూ! నాకు అది వద్దు. దానికి బదులుగా, నేను ఒక రోజు కడుపు నిండా తిని, ఒక రోజు ఆకలితో ఉండాలని కోరుకుంటున్నాను. నేను ఆకలితో ఉన్నప్పుడు, నీ సన్నిధిలో మొరపెట్టుకుంటాను, నిన్ను స్మరిస్తాను. నేను కడుపు నిండా తిన్నప్పుడు, నిన్ను స్తుతిస్తాను, నీకు కృతజ్ఞతలు తెలుపుకుంటాను. **(ముసన్నిద్ ఇమాం అహ్మద్ బిన్ హంబల్, సంపుటి 7, పేజి 402, హదీస్ ఉబై, ఇమామతు బాహిలి, హదీస్ 22543, ప్రచురణ ఆలముల్ కుతుబ్ బీరూట్)**

అంటే మహా ప్రవక్త (స) ఏ స్థితిలోనైనా అల్లాహ్‌ను మరచిపోవాలని కోరుకోలేదు. సంపద, బంగారం ఎక్కువైతే ఎక్కడ దైవస్మరణ తగ్గిపోతుందోనని ఆయన భావించారు. ఆయనకు కావాల్సింది కేవలం అల్లాహ్ స్మరణ మాత్రమే.

హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) వారు ఇలా వివరించారు: "దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తనపై తాను విధించుకున్న ఈ కష్టాలు లేదా ఆర్థికంగా కనిపించే సామాన్య స్థితి అల్లాహ్ ఆయనకు ఏమీ ఇవ్వనందువల్ల కలిగినవి కావు. అల్లాహ్ ఆయనకు అపారంగా ప్రసాదించాడు. కానీ, అల్లాహ్ పట్ల ఉన్న ప్రేమ, అతని స్మరణలో నిమగ్నమై ఉండటం కోసమే ప్రవక్త (స) స్వయంగా ఈపేదరికం లేదా నిరాడంబరత జీవితాన్ని ఎంచుకున్నారు. అయితే, దీని అర్థం ఆయన అల్లాహ్ అనుగ్రహాలను తిరస్కరించారని కాదు. ఆయన మంచిగా వండిన ఆహారాన్ని, అల్లాహ్ ప్రసాదించిన ఇతర వరాలను కూడా స్వీకరించేవారు, వాటిపై అల్లాహ్‌కు ఎంతో కృతజ్ఞతలు తెలుపుకునేవారు."

**(తఫ్సీర్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం, సంపుటి 8, పేజి 42-43)**

ఇదేవిధంగా ఒక ఉల్లేఖనంలో హజ్రత్ అబూ బక్ర (రజి) ఇలా వివరించారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నకు ఏదైనా సంతోషకరమైన విషయం ఎదురైనా లేదా ఏదైనా శుభవార్త విన్నా, ఆయన వెంటనే అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి సజ్దాలో పడిపోయేవారు.

**(సునన్ అబూ దావూద్, కితాబుల్ జిహాద్, బాబ్ ఫీ సుజూదు ష్షుకర్ హదీస్ 2774)**

అల్లాహ్ పట్ల ప్రేమ, అతన్ని స్తుతించు అసలు అర్థం ఇదే. అతని దాసుడిగా ఉండటంలోని గొప్పతనం ఏమిటంటే, ఏ చిన్న సంతోషం కలిగినా వెంటనే అతని ముందు తల వంచి కృతజ్ఞతలు తెలియ జేయాలి.

హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: నీవు పడకపైకి వెళ్ళేటప్పుడు (నిద్రపోయే ముందు), నమాజు కోసం చేసుకున్నట్లే వుజూ చేసుకో. ఆపై కుడి వైపుకు తిరిగి పడుకుని ఈ దువా చదువుకో: ఆయా దువాల అనువాదాన్ని నేను చదువుతున్నాను. ఓ అల్లాహ్! నేను నన్ను నీకు అప్పగించుకున్నాను. నా పనులన్నీ నీకే అప్పగించాను, నిన్నే నా ఆసరాగా చేసుకున్నాను. నీపై ఉన్న భయంతో మరియు ప్రేమతో (ఈ విధంగా చేస్తున్నాను). నీవు తప్ప నాకు వేరే రక్షణగానీ, విముక్తి స్థానంగానీ లేదు. విముక్తి కేవలం నీ వద్దే ఉంది. నీవు పంపిన గ్రంథంపై మరియు నీవు పంపిన ప్రవక్తపై నేను విశ్వాసం ఉంచాను. ప్రవక్త (స) ఇంకా ఇలా అన్నారు: ఒకవేళ నీవు ఈ దువా చదివిన ఆ రాత్రే మరణిస్తే, నీవు సహజమైన విశ్వాసం పైనే మరణించినట్లు లెక్క. ఈ మాటలనే నీ చివరి మాటలుగా చేసుకో. కథకుడు ఇలా వివరించారు: నేను ఈ మాటలను గుర్తుంచుకుంటానని చెబుతూ, వాటిని తిరిగి చదివేటప్పుడు వబిరసూలిక ల్లజి అర్‌సల్‌త అనగా నీవు పంపిన నీ సందేశహరునిపై నేను విశ్వాసం ప్రకటించాను అని కూడ చదువుతాను అని అన్నాను. అప్పుడు ప్రవక్త(స) నన్ను సరిచేస్తూ, కాదు, నీవు ఇలా అను: వబినబియ్యిక ల్లజి అర్‌సల్‌త అనగా నీవు పంపిన నీ ప్రవక్తపై నేను విశ్వాసం ప్రకటించాను అని చెప్పారు. (అంటే ప్రవక్త (స) నేర్పిన పదాలను అలాగే పలకడం ఎంత ముఖ్యమో దీని ద్వారా తెలుస్తుంది).

**(సహి ముస్లిం ఉర్దూ అనువాదం. సంపుటి 14, పేజి 82-83, కితాబు జ్జికర్ వద్దుఆ. ... బాబ్ మా యఖూలు ఇందన్నౌమి వ అఖజల్ ముజ్‌జఅ హదీస్ సంఖ్య 4870, నూర్ ఫౌండేషన్)**

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఈ స్థితిని వివరిస్తూ ఇలా వ్రాశారు: " దైవ ప్రవక్త(స) ఒక్క క్షణం కూడా మరణాన్ని మర్చిపోయేవారు కాదు. ఆయనపై దైవభీతి ఎంతగా ప్రబలి ఉండేదంటే, ప్రతిరోజూ బహుశా ఈ రోజే నా మరణం సంభవిస్తుందేమో, ఈ రోజే అల్లాహ్ సన్నిధికి వెళ్ళాల్సి వస్తుందేమో అన్న నిశ్చయంతో నిద్రించేవారు. అందుకే ఆయన ఎప్పుడూ ఒక ప్రయాణీకుడిలా ఉండేవారు. రైలు ఇప్పుడే బయలుదేరుతుందేమో అన్నట్లుగా సిద్ధంగా ఉండే ప్రయాణీకుడిలా. అటువంటి ప్రయాణీకుడు తనను తాను వదలలేనంతటి పనుల్లో ఎప్పుడూ చిక్కుకోడు, ఎందుకంటే రైలు ఎక్కడ తప్పిపోతుందో అన్న భయం అతనికి ఉంటుంది. ఇదే విధంగా ప్రవక్త (స) తన ప్రియతముడైన అల్లాహ్ వద్దకు వెళ్ళడానికి ప్రతిక్షణం సిద్ధంగా ఉండేవారు. గడిచే ప్రతి క్షణాన్ని ఆయన దైవ అనుగ్రహంగా భావించేవారు, మరణాన్ని ఎప్పుడూ స్మరించుకునేవారు.

హజ్రత్ హుజైఫా (రజి) ఉల్లేఖించిన కథనం ప్రకారం: దైవ ప్రవక్త(స) పడకపై పడుకునేటప్పుడు, తన కుడి చేతిని బుగ్గ కింద ఉంచుకుని ఇలా ప్రార్థించేవారు: "ఓ నా పర్యవేక్షకుడా! నా మరణం మరియు నా జీవితం నీ నామముననే జరగవలెను. ఆయన నిద్ర నుండి మేల్కొన్నప్పుడు ఇలా అనేవారు: "మమ్మల్ని మరణించిన తర్వాత (నిద్ర తర్వాత) తిరిగి బ్రతికించిన నా ప్రభువుకు కృతజ్ఞతలు. మేము తిరిగి ఆయన వద్దకే వెళ్ళాల్సి ఉంది." ఈ వాస్తవం ద్వారా మనకు తెలిసేదేమిటంటే, ప్రవక్త (స) ప్రతిరోజూ రాత్రి పడుకునేటప్పుడు తన లెక్కను (వ్యవహారాలను) ముగించుకుని పడుకునేవారు. ఒకవేళ నేను మరణించినా నా ముగింపు నీ నామముననే ఉండాలి అని అల్లాహ్‌ను వేడుకునేవారు. తిరిగి మేల్కొన్నప్పుడు, అల్లాహ్ చేసిన ఉపకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ, "నేను నా వంతుగా ఈ ప్రపంచం నుండి విడిపోయినప్పటికీ, నీ అనుగ్రహం వల్లనే నీవు నన్ను తిరిగి బ్రతికించి, నా ఆయుష్షును పెంచావు అని భావించేవారు. మొదటి దువా ద్వారా ప్రవక్త (స) మరణాన్ని ఎంతగా స్మరించేవారో తెలిసినట్లే, ఈ రెండవ దువా కూడా దానికి ఒక గొప్ప సాక్ష్యంగా నిలుస్తుంది. దైవ ప్రవక్త(స) తన జీవితంలోని ప్రతి ఘడియను చివరి ఘడియగా భావించేవారు. నిద్రపోయే ముందు తన వ్యవహారాలన్నింటినీ తన ప్రభువుతో పరిష్కరించుకునేవారు. అంటే ప్రతి మార్పుకు ఆయన సిద్ధంగా ఉండేవారు.

హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) ఉల్లేఖనం ప్రకారం: దైవ ప్రవక్త(స) తన పడకపై పడుకునేటప్పుడు కుడి వైపుకు తిరిగి పడుకుని ఇలా ప్రార్థించేవారు: ఓ నా ప్రభూ! నేను నా ప్రాణాన్ని నీకు అప్పగిస్తున్నాను. నా దృష్టినంతటినీ నీ వైపునకే మళ్ళిస్తున్నాను. నా వ్యవహారాలన్నింటినీ నీ చేతుల్లోనే ఉంచుతున్నాను. నిన్నే నా ఆశ్రయంగా చేసుకుంటున్నాను. నేను నీ నుండి మేలును ఆశిస్తున్నాను, నీ గొప్పతనం, నీ నిరపేక్షత పట్ల భయభక్తులు కలిగి ఉన్నాను. నీ ఆగ్రహం నుండి తప్పించుకోవడానికి నీవు తప్ప వేరే రక్షణ స్థలము కానీ, విముక్తి మార్గము కానీ లేదు. నీ వద్ద నుండే విముక్తిని, ఆశ్రయాన్ని కోరుతున్నాను. నీవు ప్రసాదించిన గ్రంథంపై, నీవు పంపిన ప్రవక్తపై నేను విశ్వాసం ఉంచుతున్నాను.

ప్రవక్త (స) ఈ దువాలను మనకు నేర్పడమే కాకుండా, స్వయంగా వాటిని ఎంతో నిష్ఠతో పాటించేవారు. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఈ విషయాన్ని వివరిస్తూ ఇలా వ్రాశారు: వ్యాపారులు తమ దుకాణాలను మూసివేసేటప్పుడు ఆ రోజు లెక్కలన్నీ సరిచూసుకుంటారు. కానీ సాధారణ ప్రజలు రాత్రి పడుకునేటప్పుడు అల్లాహ్‌తో తమకున్న సంబంధం, లెక్కల గురించి అస్సలు పట్టించుకోరు. అయితే, ఆ మహోన్నత వ్యక్తి (ముహమ్మద్ (స)) స్థితిని చూడండి! ఆయన ఉదయం నుండి సాయంత్రం వరకు అల్లాహ్ విధించిన బాధ్యతలను నెరవేర్చడంలో నిమగ్నమై ఉండే వారు. కేవలం స్వయంగా ఆచరించడమే కాకుండా, వేల సంఖ్యలో ఉన్న తన అనుచరులు కూడా తమ విధులను సరిగ్గా నిర్వర్తిస్తున్నారా లేదా అని పర్యవేక్షించే వారు. అయినప్పటికీ, రాత్రి పడుకునే ముందు తాను చేసిన ఆ ప్రయత్నాలన్నింటినీ, ఆ ఆరాధనలన్నింటినీ పక్కన పెట్టి, అత్యంత వినయంతో తన ప్రభువు సన్నిధిలో లెక్కలు సరిచూసుకోవడానికి నిలబడేవారు. తాను అసలు ఏ సేవ చేయలేదన్నంత వినయంతో ఉండేవారు. తన ప్రాణాన్ని పూర్తిగా అల్లాహ్‌కు అప్పగించి, ఈ ప్రపంచంతో, అందులోని వస్తువులతో ఎటువంటి సంబంధం లేదని చాటిచెప్పి, తన చేతిని అల్లాహ్ చేతిలో పెట్టే వరకు ఆయన నిద్రపోయేవారు కాదు.

**(సీరతున్నబియ్యి సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి, సంపుటి 1, పేజి 83-85)**

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త(స) ఇలా ప్రవచించారు: ఫజర్ నమాజు నుండి సూర్యోదయం వరకు అల్లాహ్‌ను స్మరించే వారితో కలిసి కూర్చోవడం, హజ్రత్ ఇస్మాయీల్ అలైహిస్సలాం సంతానానికి చెందిన నలుగురు బానిసలను విముక్తం చేయడం కంటే నాకు ఎంతో ఇష్టం. అలాగే, అసర్ నమాజు నుండి సూర్యాస్తమయం వరకు అల్లాహ్‌ను స్మరించే వారితో కలిసి కూర్చోవడం నాకు నలుగురు బానిసలను విముక్తం చేయడం కంటే మిన్న.

**(సునన్ అబూ దావూద్, కితాబుల్ ఇల్మ్, బాబ్ ఫిల్ ఖసస్, హదీస్ 3667)**

అల్లాహ్ పట్ల ఉన్న ప్రేమ కారణంగానే, అల్లాహ్‌ను ప్రేమించే వారికి, ఆయనను స్మరించే వారికి ప్రవక్త (స) తన బంధువుల కంటే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. దైవస్మరణ జరుగుతున్న చోట తాను ఉండకపోవడాన్ని ఆయన ఊహించ లేకపోయేవారు.

అల్లాహ్ పట్ల ఆయనకున్న ప్రేమ ఎంతటిదంటే, అది ఆయన అనుచరులలో కూడా అటువంటి తపననే నింపింది.

తమ అనుచరులకు బోధన చేస్తూ ఆయన ఇలా అన్నారు. అల్లాహ్ దృష్టిలో అన్నిటికంటే ఇష్టమైన కర్మ ఏమిటంటే నీ మరణం సంభవించేటప్పుడు నీ నాలుక అల్లాహ్ స్మరణతో తడిసి ఉండటం.

**(అల్ జామిఉ సఘీర్, లిస్సుయూతి, భాగం 1, పేజి 19, హంజ అనే పదం, హదీస్ 198, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)**

హజ్రత్ అబూ దర్దా (రజి) ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త(స) ఇలా అడిగారు: మీ యజమాని (అల్లాహ్) దృష్టిలో అన్నిటికంటే ఉత్తమమైన, అత్యంత పవిత్రమైన, మీ అంతస్తులను పెంచే, బంగారం, వెండిని దానం చేయడం కంటే మిన్నయైన ఒక కర్మ గురించి నేను మీకు చెప్పనా?. అది శత్రువును ఎదుర్కొని యుద్ధం చేయడం (జిహాద్) కంటే కూడా గొప్పది. అనుచరులు, తప్పకుండా చెప్పండి ఓ అల్లాహ్ ప్రవక్త! అని వేడుకున్నారు. నేడు ముస్లింలు యుద్ధం చేయడమే (జిహాద్) శ్రేష్ఠమైనది అని భావిస్తారు, గొంతులు కోస్తున్నారు. శత్రువుల గొంతులు కోయలేరు. తమ వారి గొంతులను కోస్తున్నారు. ఇది అన్నిటి కంటే పెద్ద పాపం. కానీ ప్రవక్త (స) ఇక్కడ అంతకంటే గొప్ప విషయాన్ని చెబుతున్నారు. ఆయన (స) ఇలా సెలవిచ్చారు: అది అల్లాహ్ స్మరణ. అల్లాహ్‌ను స్మరించండి, ఇది అన్ని జిహాద్‌ల కంటే గొప్ప జిహాద్.

నేటి కాలంలో కొందరు ఇతరుల గొంతులు కోయడమే జిహాద్ అనుకుంటున్నారు. కానీ ప్రవక్త (స) దృష్టిలో హృదయ పూర్వకమైన దైవస్మరణే అత్యున్నతమైనది.

ముస్లింలపై మోపబడే నిందలకు భిన్నంగా, అసలైన బోధన ఏమిటో హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) ఇలా వివరించారు. ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:
అల్లాహ్ స్మరణ కంటే మిన్నగా అల్లాహ్ శిక్ష నుండి రక్షించేది మరొకటి లేదు.

**(సునన్ ఇబ్నే మాజా, కితాబుల్ అదబ్, బాబ్ ఫజల్ జికర్, హదీస్ 3790)**

అంటే, మనిషి దైవస్మరణలో ఉన్నప్పుడు, అతను అనేక పాపాల నుండి,

వాటి వల్ల కలిగే శిక్షల నుండి రక్షించబడతాడు.

అల్లాహ్ పట్ల ఉన్న అమితమైన ప్రేమ కారణంగా, దైవ ప్రవక్త(స) కి ప్రతిక్షణం దైవస్మరణలో ఉండటం అత్యంత ప్రియమైన పని.

హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం, ప్రవక్త (స) ఇలా అన్నారు:నేను 'సుబ్హానల్లాహ్', 'అల్హందులిల్లాహ్', 'లా ఇలాహ ఇల్లల్లాహ్' మరియు 'అల్లాహు అక్బర్' అని పలకడం. సూర్యుడు ఉదయించే ఈ ప్రపంచంలోని సమస్త వస్తువుల కంటే నాకు ఎంతో ప్రియమైనది.

**(సహి ముస్లిం అనువాదం, సంపుటి 14, పేజి 66, కితాబు జ్జికర్ వ ద్దుఆ, .... బాబ్ ఫజలుల్ తహ్లీల్ వ తస్బీహ్ వ ద్దుఆ. హదీస్ 4847, నూర్ ఫౌండేషన్)**

దైవప్రేమలో నిండిన ఈ అద్భుతమైన స్థితి కారణంగానే, ప్రవక్త (స) తన జీవితపు చివరి క్షణాల్లో కూడా తన 'నిజమైన ప్రేమికుడు' (అల్లాహ్) నామాన్ని స్మరిస్తూనే ఉన్నారు.

హజ్రత్ ఆయిషా (రజి) గారిట్లు ఉల్లేఖించారు : దైవ ప్రవక్త(స) ఆరోగ్యంగా ఉన్నప్పుడు తరచుగా ఇలా సెలవిచ్చేవారు. ఏ ప్రవక్త కూడా తనకు స్వర్గంలో ఉన్న స్థానాన్ని చూపించబడే వరకు మరియు (భౌతిక జీవితం లేదా పరలోకం మధ్య) ఎంచుకునే అవకాశం ఇవ్వబడే వరకు మరణించడు.ఆయన మరణ సమయం దగ్గర పడినప్పుడు, ఆయన శిరస్సు నా ఒడిలో (తొడపై) ఉంది. అప్పుడు ఆయనకు కొంతసేపు స్పృహ తప్పింది, మళ్ళీ తెలివి వచ్చిన తర్వాత ఆయన తన చూపును ఇంటి పై కప్పు వైపునకు సారించి ఇలా అన్నారు: అల్లాహుమ్మా రఫీఖల్ ఆలా!. (ఓ అల్లాహ్! ఆ అత్యున్నత స్నేహితుడే నాకు కావాలి.హజ్రత్ ఆయిషా (రజి) గారు ఇలా వివరించారు: ఆ మాట వినగానే, ఆయన ఇక మనతో ఉండరని, తన ప్రభువు వద్దకు వెళ్ళడానికే నిశ్చయించుకున్నారని నాకు అర్థమైపోయింది. ఆయన ఆరోగ్యంగా ఉన్నప్పుడు చెప్పిన ఆ 'ఎంపిక' ఇదేనని నేను గ్రహించాను.హజ్రత్ ఆయిషా (రజి) గారి కథనం ప్రకారం, దైవ ప్రవక్త(స) పలికిన ఆఖరి మాటలు ఇవే: అల్లాహుమ్మా రఫీఖల్ ఆలా!.

**(సహి బుఖారి సంపుటి 9, పేజి 351, కితాబుల్ ముఘాజి, ఆఖిరు మా తుకల్లిము బి నబియ్యి సల్లల్లాహు అలైహి వసల్లం హదీస్ 4463 నజారత్ ఇషాఅత్)**

హజ్రత్ ఆయిషా (రజి అల్లాహు అన్హా) ఒక చోట ఇలా వివరించారు: "అల్లాహ్ నాపై కురిపించిన అనుగ్రహాలలో ఒకటి ఏమిటంటే దైవ ప్రవక్త(స) నా ఇంట్లో, నా వంతు రోజున, నా ఛాతి మరియు మెడ మధ్య విశ్రమిస్తూ మరణించారు. అల్లాహ్ ఆయన మరణ సమయంలో నా లాలాజలాన్ని మరియు ఆయన లాలాజలాన్ని కలిపాడు.ఆ లాలాజలం కలిసిన సందర్భాన్ని ఆమె ఇలా వివరించారు: నా సోదరుడు అబ్దుర్రహ్మాన్ చేతిలో పండ్ల పుల్ల పట్టుకుని లోపలికి వచ్చారు. అప్పుడు నేను దైవ ప్రవక్త(స)కి ఆసరాగా ఉన్నాను. ప్రవక్త (స) ఆ పండ్ల పుల్ల వైపు చూడటం నేను గమనించాను. ఆయనకు పండ్ల పుల్ల అంటే ఇష్టమని నాకు తెలుసు. 'నేను దానిని మీ కోసం తీసుకోవాలా?' అని అడిగాను. ఆయన అవునన్నట్లుగా తల ఊపారు. నేను దానిని ఆయనకు ఇచ్చాను, కానీ అది ఆయనకు గట్టిగా అనిపించింది. నేను 'దీనిని మీ కోసం మెత్తగా చేయనా?' అని అడిగాను. ఆయన మళ్ళీ తల ఊపారు. అప్పుడు నేను ఆ పండ్ల పుల్లను నా నోటితో నమిలి మెత్తగా చేసి ఆయనకు ఇచ్చాను.ఆ సమయంలో ప్రవక్త (స) ముందు ఒక నీటి పాత్ర ఉంది. ఆయన తన చేతులను నీటిలో ముంచి, ముఖంపై తుడుచుకుంటూ ఇలా అంటున్నారు: లా ఇలాహా ఇల్లల్లాహు ఇన్న లిల్ మౌతి సకరాతున్. (అంటే: అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు. నిశ్చయంగా మరణానికి కష్టాలు/వేదనలు ఉంటాయి.) ఆ తర్వాత ఆయన తన చేయి పైకెత్తి, ఫీ ర్రఫీఖిల్ ఆలా (అత్యున్నత స్నేహితుని వద్దకు) అని అంటూ ప్రాణాలు విడిచారు. ఆ వెంటనే ఆయన పవిత్ర హస్తం కిందకు వాలిపోయింది.

**(సహి బుఖారి కితాబుల్ ముఘాజి, బాబ్ మరజున్నబియ్యి సల్లల్లాహు అలైహి వసల్లం.వ వఫాతుహు హదీస్ 4449)**

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా వివరించారు:" అల్లాహ్ తఆలా దైవ ప్రవక్త(స)గారికి ఆఖరి క్షణాల్లో ఒక ఎంపికను ఇచ్చాడు. అంటే నీవు కోరుకుంటే ఈ లోకంలోనే ఉండవచ్చు లేదా నీవు కోరుకుంటే నా వద్దకు రావచ్చు అని అల్లాహ్ అవకాశం ఇచ్చాడు. అప్పుడు ప్రవక్త (స) ఇలా విన్నవించారు: 'ఓ నా ప్రభూ! ఇప్పుడు నేను నీ వద్దకు రావాలనే కోరుకుంటున్నాను.' ఆయన పవిత్ర ప్రాణాలు దేహం నుండి వేరుపడే సమయంలో ఆయన పలికిన ఆఖరి మాటలు ఇవే: బిర్రఫీఖిల్ ఆలా అనగా నేను ఇక ఈ లోకంలో ఉండాలని కోరుకోవడం లేదు, నా అల్లాహ్ వద్దకే వెళ్ళాలని ఆశిస్తున్నాను.

**(నూరుల్ ఫుర్ఖాన్ భాగం 2, రూహాని ఖజాయిన్ సంపుటి 9, పేజి 411)**

అల్లాహ్ ఆయనకు పూర్తి అధికారం ఇచ్చాడు, ఒకవేళ ఆయనకు ఇంకా జీవించాలని కోరిక ఉంటే అలాగే జరిగేది. కానీ ఆయన, 'ఇక నేను ఈ ప్రపంచంలో ఉండదలచుకోలేదు' అని బదులిచ్చారు. ఆ విధంగా ఆయన అల్లాహ్ సన్నిధికి చేరుకున్నారు. اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى اٰلِ مُحَمَّدٍ وَّبَارِكْ وَسَلِّمْ اِنَّكَ حَمِيْدٌ مَّجِيْدٌ۔






**(1వ పేజి తరువాత)**

ఈ ఆంశాన్ని గూర్చి అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పినాడు:

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوا اتَّقُوا اللّٰهَ وَذَرُوْا مَا بَقِيَ مِنَ الرِّبٰۤوا اِنْ كُنْتُمْ مُّؤْمِنِيْنَ ○ فَاِنْ لَّمْ تَفْعَلُوْا فَاْذَنُوْا بِحَرْبٍ مِّنَ اللّٰهِ وَرَسُوْلِهٖ

అనగా: ఒకవేళ వడ్డీవ్యాపారం నుండి బయటికి రానిచో అది అల్లాహ్ మరియు అతని ప్రవక్తతో యుద్ధ ప్రకటనతో సమానం. అల్లాహ్‌పై విశ్వాసంను పెంచుకున్న వారికి ఇలాంటి పరిస్థితులే రావనేది మా అభిమతం. ఒకవేళ ముసల్మానులు ఈ లోభిలో మునిగిపోతున్నచో ఇది వారు తమ స్వహస్తాలతో చేసుకున్న కర్మ. ఒకవేళ హైందువులు ఇలాంటి పాపపు వ్యాపారం చేసినచో ధనవంతులవుతారు. కాని ఒకవేళ ముసల్మానులు ఇలాంటి పాపపు వ్యాపారం చేసినచో వారు నాశనమైపోతారు. خَسِرَ الدُّنْيَا وَالْاٰخِرَةَ అనగా 'ఇహపర లోకాలను నాశనం చేసుకున్న వారు'ను పోలిన వారగుదురు. ముసల్మానులు ఇలాంటి స్థితి నుండి బయటపడడం ఉత్తమం కాజాలదా!.

మానవుడు ముందు నుండే తన ఆధాయ వనరులను పొదుపుగా వాడుకొన వలెను. ఫలితముగా అసలు కంటే ఎక్కువగా చెల్లించునట్టి వడ్డీపై అప్పు చేయు దుస్థితి ఏర్పడదు. నిన్ననే ఒక వ్యక్తి నుండి ఉత్తరం వచ్చింది. ఇప్పటి వరకు వెయ్యి రూపాయలను చెల్లించాను. ఇంకా ఐదువందల రూపాయలు బాకి ఉన్నాయి. పైగా న్యాయస్థానాలు కూడ శిక్షలు వేస్తుంటాయి. వాస్తవానికి ఇందులో న్యాయస్థానాల తప్పేముంది?. అతని అంగీకార పత్రము ఉన్నప్పుడు దాని అర్థం అట్టివ్యక్తి వడ్డీ చెల్లిస్తానని అంగీకరించినట్లే కదా!. అందువలనే శిక్షలు విధించడం జరుగుతుంది. అందుకే దీని కంటే ఉత్తమమైన మార్గమేమనగా, ముసల్మానులు ఐక్యమత్యముగా, కొంత ధనంను సమకూర్చుకోని, ఏదేని వ్యాపారం చేస్తూ ఆ ధనంను రెట్టింపు చేసుకోవచ్చును. ఫలితముగా తమ ఏ సోదరుడికి కూడ వడ్డీపై అప్పు తీసుకునే అవసరమే వచ్చేది కాదు. నిజానికి ఆ వ్యాపార బృంధం నుండే ప్రతి వ్యక్తి తన అవసరాలకు అనుగుణముగా చే బదులు తీసుకునేవారు, నిర్ణయిత సమయానికి తిరిగి ఇచ్చేసేవారు.

**(బదర్ వార పత్రిక, సంపుటి 7, సంచిక 6 ఫిబ్రవరి 1908, పేజి 6, సేకరణ తఫ్సీర్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సంపుటి 1, పేజి 389-390)**

---

**(2వ పేజి తరువాత)**

ఇలాంటి పరిస్థితులో నిజాయితీ గలవారు , ఎలాంటి సంఘం లేని వారు (ఎందుకనగా వ్యాపారాలు చేసేవారు చాలా పెద్ద సంఘాన్ని నడిపిస్తుంటారు) నష్టపోతున్నారు. వారి ధనమును హరించి వేయడం జరుగుతుంది. అహ్మదీయులు ఇలాంటి హానికరమైన ఆచారాలను విడిచిపెట్టి అల్లాహ్ ఆజ్ఞలను అనుసరించాలి. ఇందులోనే అందరి శ్రేయస్సు గలదు. అదే విధముగా రోజువారీ జీవితంలోని అనగా ప్రయాణంలో డబ్బు అప్పు తీసుకోవడం లేదా స్నేహితుల నుండి తాత్కాలిక సహాయం పొందడం వంటి సందర్భాల్లో కూడా చిన్న అప్పులను వ్రాసి పెట్టాలని సూచించబడింది.

హుజూర్ గారు ఇలా తెలిపారు: రబ్వా ప్రారంభ దశలో దుకాణాలు తక్కువగా ఉండేవి. హజ్రత్ మిర్జా షరీఫ్ అహ్మద్ గారు ఒకసారి సరుకులు కొనుగోలు చేశారు, కానీ డబ్బు సరిపోలేదు. వారితో ఉన్న సేవకుడు మిగిలిన మొత్తం చెల్లించాడు. ఇంటికి వచ్చిన తర్వాత, సేవకునికి డబ్బు తిరిగి ఇచ్చే వరకు వారు సరుకులను లోపలికి తీసుకవెళ్ళలేదు. "డబ్బు చెల్లించే వరకు ఈ సరుకులు నావి కావు; చెల్లించినవాడివే" అని అన్నారు. ఇలాంటి ఉదాహరణలు సమాజంలో అమలైతే అనేక తగాదాలు తొలగిపోతాయి. అంతేగాకుండా అప్పు ఇచ్చేవారు అప్పు తీసుకున్నవారితో దయతో వ్యవహరించాలని కూడా బోధిస్తుంది. ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలిపాడు:

**వ ఇన్ కాన జూ హుస్రతిన్ ఫనజిరతున్ ఇలా మైసరతిన్ వ అన్ తసద్దఖూ ఖైరుల్లకుం ఇన్ కున్‌తుం తఅలమూన్. (బఖర: 281)**

అనగా "అప్పుదారు కష్టాల్లో ఉంటే, అతనికి సౌలభ్యం కలిగే వరకు గడువు ఇవ్వండి. మీరు దానిని క్షమిస్తే, అది మీకే మేలైనది." అప్పుదారు నిజంగా కష్టాల్లో ఉంటే, అప్పు ఇచ్చేవాడు అతనికి సులభమైన వాయిదాలు ఇవ్వాలి లేదా సాధ్యమైతే అప్పును పూర్తిగా క్షమించాలి. అలాంటి దయకు అల్లాహ్ గొప్ప ప్రతిఫలం ఇస్తాడు.


అలాగే హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ రజి గారి ఒక కథనము గలదు. ఒక వ్యక్తి వారితో తాను 25వేల రూపాయల అప్పులో ఉన్నాను అని విన్నవించుకున్నాడు. అందుకు హుజూర్ రజి ఇలా అన్నారు. అందుకు మూడు పరిష్కార మార్గాలున్నాయి.

(1) ఎక్కువగా అల్లాహ్ క్షమాపణ కోరాలి (ఇస్తిగ్ఫార్).

(2) ఆడంబరపు ఖర్చులు మరియు అనవసర వ్యయాలను మానుకోవాలి.

(3) ఎంత చిన్న మొత్తం వచ్చినా, అప్పు తీర్చడానికి కొంత భాగం వెంటనే చెల్లించాలి. (హయాతే నూర్, పేజి 517, మౌలాన అబ్దుల్ ఖాదిర్ సాహెబ్)

అల్లాహ్ ప్రతి అహ్మదీయుడిని అప్పుల వల్ల కలిగే సమస్యలు మరియు అవినీతి నుండి కాపాడుగాకా!. తమ ప్రీతి కరమైన మార్గంలో నడిపించుగాకా!. ఆమీన్.

# జుమా ప్రసంగము

**ప్రవక్త (స) సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆరాధనకు చెందిన ఏ అవకాశాన్నీ జారవిడుచుకోలేదు. పైగా, నిద్రలో కూడా వారు ఆరాధనలో నిమగ్నమై ఉండేవారు. వారే స్వయంగా ఇలా అన్నారు: "నా కళ్ళు నిద్రపోతాయి, కానీ నా హృదయం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్మరణ మరియు ఆరాధన నుండి ఎన్నడూ విముఖంగా ఉండదు."**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 06 ఫిబ్రవరి 2026, ( 06 తబ్లీఘ్ 1405 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

సర్వశక్తిమంతుడైన అల్లాహ్, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రతి విషయంలోనూ మనకు ఒక ఉత్తమ ఆదర్శమని ప్రకటించాడు. గత ప్రసంగాలలో, అల్లాహ్ పట్ల దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రేమ గురించి ప్రస్తావించడం జరిగింది. అల్లాహ్ పట్ల వారి ప్రేమకు సంబంధించి, వారి ఆరాధన యొక్క ఉన్నత ప్రమాణాలు కూడా ప్రస్తావించబడ్డాయి. వాస్తవానికి, అల్లాహ్ పట్ల వారి ప్రేమ అనే అంశాన్ని పూర్తి చేసిన తర్వాత, వారి ఆరాధనను ఒక ప్రత్యేక విషయంగా ప్రస్తావించాలని నేను భావించాను. అయితే, అల్లాహ్ పట్ల వారి ప్రేమకు సంబంధించిన వృత్తాంతాలను నేను వివరించడం ప్రారంభించినప్పుడు, వారి ఆరాధనకు సంబంధించిన అనేక సంఘటనలు కూడా ప్రస్తావించబడ్డాయి. నేను కోరుకున్నప్పటికీ, ఈ రెండు విషయాలను వేరు చేయలేకపోయాను, ఎందుకంటే అవి రెండూ పెనవేసుకు పోయాయి. అల్లాహ్ ప్రేమ లేకుండా ఆరాధన సాధ్యం కాదు, మరియు ఆరాధన లేకుండా అల్లాహ్‌ను ప్రేమించడం సాధ్యం కాదు. ఒకవేళ ఎవరైనా అల్లాహ్‌ను ప్రేమించకపోతే, వారు ఆయనను నిజంగా ఆరాధించలేరు.

అయినప్పటికీ, ఈ రోజు నేను ఈ అంశంపై మరింత వివరిస్తాను, కానీ ఆరాధన దృక్కోణంలో. అయితే, గత ప్రసంగంలో నేను చెప్పినట్లుగా, దీని తీవ్రత్త సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల ప్రేమే.

ఒక వచనాన్ని ప్రస్తావిస్తూ, పవిత్ర ఖురాన్‌లో దైవ ప్రవక్త యొక్క ఆరాధన యొక్క స్థితిని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ క్రింది సూక్తిలో ఎలా పేర్కొన్నాడో నేను ఇంతకుముందు ఉపన్యాసంలో వివరించాను: ఖుల్ ఇన్నస్సలాతి వ నుసుకీ వ మహ్‌యాయి వ మమాతి లిల్లాహి రబ్బిల్ ఆలమీన్. (అన్‌ఆమ్:163) అనగా "నా ప్రార్థన మరియు నా త్యాగం మరియు నా జీవితం మరియు నా మరణం అన్నీ అల్లాహ్ కోసం అని చెప్పండి." నేను చెప్పినట్లుగా, ఈసూక్తి గురించి నేను గత ఉపన్యాసంలో ఇప్పటికే వివరించాను. అందువల్ల, దానిని మళ్ళీ పునరావృతం చేయవలసిన అవసరం లేదు. దీని తరువాత, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు ఇలా ప్రకటించమని ఆజ్ఞాపించాడు: ఫత్తబిఊని యుహ్‌బిబ్‌కుముల్లాహు (ఆలే ఇమ్రాన్: 32) అనగా, "నన్ను అనుసరించండి: (అప్పుడు) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు."ఈ విధంగా, ఆ ప్రమాణాలను మనం కూడా పొందాలని ఆయన ఆజ్ఞాపిస్తున్నాడు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా అంటున్నాడు: ప్రజలతో చెప్పండి, మీరు నన్ను అనుసరిస్తే, అల్లాహ్ మిమ్మల్ని కూడా ప్రేమిస్తాడు, మరియు మీరు అల్లాహ్ ప్రేమను పొందగలుగుతారు. ఈ విధంగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు ఈ ప్రకటన చేయమని ఆజ్ఞాపించడం ద్వారా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ ప్రమాణాలను సాధించడానికి మనం చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేయాలని కూడా ఆశిస్తున్నాడు.

ఆరాధనకు సంబంధించి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దైవ ప్రవక్త (స) ద్వారా పవిత్ర ఖురాన్‌లో లెక్కలేనన్ని ఆజ్ఞలను ఇచ్చాడు. ఒక చోట, అల్లాహ్ ఇలా చెప్పాడు: వమా ఖలఖ్‌తుల్ జిన్న వల్ ఇన్‌సా ఇల్లా లియాఅబుదూన్. (అజ్జారియాత్: 57) అనగా "నేను జిన్నాతులను మరియు మనుషులను నన్ను ఆరాధించడానికే పుట్టించాను." కాబట్టి, మీరు నన్ను అనుసరించాలనుకుంటే, మనిషి యొక్క సృష్టి యొక్క ఉద్దేశ్యాన్ని నేను అర్థం చేసుకున్నట్లుగా, మీరు కూడా దానిని అర్థం చేసుకుని, దాని హక్కును నెరవేర్చడానికి ప్రయత్నించాలని దైవ ప్రవక్త స్పష్టంగా చెప్పారు. అప్పుడే మీరు మీ సృష్టి యొక్క ఉద్దేశ్యాన్ని నెరవేర్చగలుగుతారు మరియు అప్పుడు మాత్రమే మీరు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ప్రేమను పొందగలుగుతారు.

మరల మన దృష్టిని ప్రార్థన వైపు మళ్లిస్తూ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మరొక ప్రదేశంలో ఇలా చెప్పాడు: యా అయ్యుహన్నాసు ఉబుదూ రబ్బకుముల్లజీ ఖలఖకుమ్ వల్లజీన మిన్ ఖబ్‌లికుం లఅల్లకుం తత్తకూన్ (బఖర:22) అనగా, "ఓ మనుష్యులారా, మిమ్మల్ని మరియు మీకు పూర్వం ఉన్నవారిని సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి, తద్వారా మీరు నిష్టాపరులు అవుతారు."

కావున, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క సామీప్యాన్ని పొందేందుకు మరియు నీతిమంతుడిగా మారడానికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను ఆరాధించడం మరియు అతనిని ఆరాధించే స్థాయిని అత్యున్నత స్థాయికి పెంచడం చాలా అవసరం.

మరల, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా తెలిపాడు: యా అయ్యుఅల్లజీన ఆమనూ అర్‌కఊ వస్‌జుదూ వఅబుదూ రబ్బకుమ్ వఫ్‌అలూల్ ఖైర లఅల్లకుమ్ తుఫ్‌లిహూన్ (హజ్:78) అనగా "ఓ విశ్వాసులారా! నమాజులో మోకరిల్లండి, మరియు సాష్టాంగపడండి మరియు మీ ప్రభువును ఆరాధించండి మరియు మీరు విజేయులు కావడానికి సత్కార్యాలు చేయండి."

ఈ విధంగా, దైవ ప్రవక్త (స) మనకు ఈ ఆజ్ఞలను అందించినప్పుడు, వారు తన స్వంత అభ్యాసం ద్వారా వాటి అత్యున్నత ప్రమాణాన్ని ప్రదర్శించారు. మరియు ఆ ప్రమాణానికి మిమ్మల్ని మీరు చేర్చుకోవడానికి మీరు ప్రయత్నించినప్పుడే నిజమైన విధేయత మరియు ప్రవక్తను అనుసరించడం పూర్తి అవుతుందని మన దృష్టిని ఆకర్షించారు. వారు తన ఉమ్మత్ కోసం చేసిన ప్రార్థనలు, మనం వారి ఆదర్శాన్ని మరియు ఆజ్ఞలను నిరంతరం దృష్టిలో ఉంచుకుని, వాటి ప్రకారం నడుచుకోవడానికి ప్రయత్నించినప్పుడే మనకు ప్రయోజనం చేకూరుస్తాయి. కేవలం బాహ్య ప్రదర్శన లేదా మాటల వాదనలు నిజమైన ప్రయోజనాన్ని చేకూర్చలేవు. ఏదేమైనా, వారు నెలకొల్పిన ప్రమాణాల నుండి నేను ఇప్పటికే అనేక ఉదాహరణలను అందించాను, మరియు ఇప్పుడు నేను అందించబోయే మరికొన్ని ఉదాహరణలు ఉన్నాయి.

ప్రవక్త (స) సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆరాధనకు చెందిన ఏ అవకాశాన్నీ జారవిడుచుకోలేదు. పైగా, నిద్రలో కూడా వారు ఆరాధనలో నిమగ్నమై ఉండేవారు. వారే స్వయంగా ఇలా అన్నారు: "నా కళ్ళు నిద్రపోతాయి, కానీ నా హృదయం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్మరణ మరియు ఆరాధన నుండి ఎన్నడూ విముఖంగా ఉండదు." (సహీ-బుఖారీ, కితాబుల్-మనాఖిబ్, హదీస్ 3569)

అంతేకాకుండా, సర్వశక్తిమంతుడు అల్లాహ్ ఎల్లప్పుడూ వారి ఎదుట నిలిచి ఉండాలనేది తమ ప్రమాణంగా ఉండాలని వారు తన అనుచరులకు బోధించారు. ఆరాధన విషయాలలో, వారు తనను తాను అత్యంత కచ్చితత్వంతో విశ్లేషించుకునేవారు. ఈ విషయంలో, ఒక కథనం ఇలా గలదు: హజ్రత్ ఆయిషా (రజి) ఇలా పేర్కొన్నారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒకసారి ముద్రికలు ఉన్న ఒక పై వస్త్రాన్ని ధరించి నమాజ్ చేశారు. ఆయన దాని ముద్రికలు ఒకసారి చూసి, నమాజ్ ముగించిన తర్వాత, ఇలా అన్నారు, "నా ఈ పై వస్త్రాన్ని అబూ జహమ్ వద్దకు తీసుకు వెళ్ళి, అబూ జహమ్ యొక్క అన్బిజానీ పై వస్త్రాన్ని (అంటే, ముద్రికలు లేని సాదా పైవస్త్రాన్ని) నా కోసం తీసుకురండి, ఎందుకంటే ఇది నా నమాజ్ నుండి నా ఏకాగ్రతను చెదర గొట్టింది." మరో మాటలో చెప్పాలంటే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి తన దృష్టి మరలిపోతుందనే భయంతో, దాని వైపు కనీసం ఒక చిన్న చూపు కూడా చూడడం వారికి ఆమోదయోగ్యం కాదు. హజ్రత్ ఆయిషా(రజి) మరల ఇలా పేర్కొన్నారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు, "నేను నమాజులో ఉన్నప్పుడు దాని ముద్రికలు చూస్తూ ఉండేవాన్ని, కావున అది ఎక్కడ నన్ను విపత్తులో పడవేస్తుందో అని నేను భయపడ్డాను." (సహీ-బుఖారీ, కితాబు స్సలాత్, హదీస్ 373)

దీనిని వివరిస్తూ, సయ్యద్ జైన్-ఉల్-అబిదీన్ వలీవుల్లా షా సాహిబ్ ఇలా వ్రాశారు, "ఈ అధ్యాయం యొక్క సారాంశం ఏమిటంటే, వస్త్రాలు నిరాడంబరంగా ఉండాలి మరియు దృష్టిని మరలించే అటువంటి అలంకరణలు లేకుండా ఉండాలి. మనో సంకల్పసిద్ధి మరియు స్వభావం వలన మానవుడు నిరాడంబరత వైపు మొగ్గు చూపుతాడు." మరల ఇలా వ్రాసారు: నేడు కూడా, దైవభక్తి స్వభావం గలవారు వస్త్రాలను ఎంచుకునేటప్పుడు నిరాడంబరమైన రంగులను ఇష్టపడటం మనం గమనిస్తాము, అయితే కొందరు నిరంతరం తమ బట్టల వైపు చూస్తూ, వాటి మడతలు సరిగ్గా ఉండేలా చూసుకోవడంపై దృష్టి పెడతారు. అయితే, నమాజ్‌లో ఒకరి పూర్తి దృష్టి అల్లాహ్ వైపు ఉండాలి కానీ వస్త్రాల వైపు కాదు. మరల ఇలా వ్రాశారు, "ప్రార్థనకు పూర్తి ఏకాగ్రత అవసరం. (అంటే, ఒక వ్యక్తి ప్రార్థనలో పూర్తిగా లీనమై, పూర్తి ఏకాగ్రతతో దానిని చేసినప్పుడు మాత్రమే అది నిజమైన ప్రార్థనగా పరిగణించబడుతుంది.) అందువల్ల, ప్రార్థన చేసేవారి పరిసరాలలో వారి దృష్టిని తమ వైపుకు ఆకర్షించే ఏ వస్తువు ఉండటాన్ని ఇస్లాం సాంప్రదాయాలు మరియు బోధనలు అనుమతించలేదు. దీని నుండి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను ఎంత లోతుగా మరియు శ్రద్ధగా ఆరాధించాలని కోరుకున్నారో స్పష్టమవుతుంది. అనగా,అల్లాహ్ నుండి దృష్టిని మరల్చగల దేనిపైనైనా కనీసం ఒక చూపు చూడడాన్ని కూడా సహించలేనంతగా. అదేవిధంగా, ఒక వ్యక్తి ముందు చిత్రాలు, బొమ్మలు ఉన్న దుస్తులు, మరియు బొమ్మలు ఉన్న తెరలు ఉండకూడదని వివిధ హదీసులు పేర్కొంటున్నాయి, ఎందుకంటే అలాంటివన్నీ ప్రార్థనలో పరధ్యానానికి కారణం కాగలవు. ఈ కారణంగా, అవి నిషేధించబడ్డాయి. ప్రార్థన చేసేటప్పుడు, ఒక వ్యక్తి ముందు దృష్టిని మరల్చే తెరలు లేదా బొమ్మలు ఉండకూడదు, మరియు అలాంటివి ఖిబ్లా దిశలో ఉండకూడదు." (సహీ బుఖారీ ఉర్దూ అనువాదం, సంపుటి 1, నజారాత్ ఇషాత్, పుట 479)

అదేవిధంగా, మరొక కథనం వారి ఆదర్శప్రాయమైన ప్రమాణాన్ని ప్రస్తావిస్తుంది. హజ్రత్ జాఫర్ బిన్ ముహమ్మద్ తన తండ్రిని ఆధారం చేసుకోని ఇలా ఉల్లేఖించారు. హజ్రత్ ఆయిషా(రజి)ను ఇలా అడిగారు: "మీ ఇంట్లో అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి మంచం ఎలా ఉండేది?" దానికి ఆమె ఇలా

సమాధానమిచ్చారు, "అది తోలుతో చేయబడింది, మరియు దాని లోపల ఖర్జూరపు పీచు నింపబడి ఉండేది." అప్పుడు హజ్రత్ హఫ్సహ్ (రజి)ను ఇలా అడిగారు, "మీ ఇంట్లో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి మంచం పరిస్థితి ఏమిటి?" ఆమె ఇలా జవాబిచ్చింది, "అది ఉన్నితో చేయబడింది, (అంటే అది జంతువుల మృదువైన వెంట్రుకలతో తయారు చేయబడింది). నేను దానిని రెండు పొరలుగా పరిచేదాన్ని, అప్పుడు అది కొద్దిగా మెత్తబడేది, మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దానిపై నిద్రించేవారు. ఒక రాత్రి, నేను ఇలా అనుకున్నాను, వారి కోసం దానిని మరింత మెత్తగా, సౌకర్యవంతంగా మరియు ఇంకా మృదువుగా చేయడానికి నేను నాలుగు పొరలు ఎందుకు పరచకూడదు?. కావున నేను దానిని నాలుగు పొరలుగా పరిచాను. ఉదయం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: 'నిన్న రాత్రి నా కోసం నువ్వు ఏమి పరిచావు?'" హజ్రత్ హఫ్సహ్ (రజి) ఇలా సమాధానం ఇచ్చారు. "నేను ఇలా విన్నవించుకున్నాను, 'అది మీ సొంత పడక; కానీ అది మీకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని నేను కేవలం నాలుగు పొరలు మాత్రమే పరిచాను.' అందుకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు, 'దానిని గతంలో మాదిరిలాగే పర్చుము. ఎందుకంటే దాని అదనపు మెత్తదనం రాత్రి ప్రార్థనలో నాకు అడ్డంకిగా మారుతోంది."

(షమాయిలే-నబీ, హదీస్ 314, నూర్ ఫౌండేషన్, పే. 134)

వాస్తవానికి పడక యొక్క మెత్తదనం వారి ఆరాధనకు అడ్డంకిగా మారలేక పోయినప్పటికీ, కేవలం మెత్తదనం కారణంగా ఒక వ్యక్తి తన ఆరాధనలో ఇబ్బంది పడవచ్చేనే ఆలోచనను కూడ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహించలేక పోయారు. పడక మెత్తగా ఉన్నచో, దానిపై కొద్దిసేపు పడుకున్నా కూడ ఎక్కడ సర్వశక్తి మంతుడైన అల్లాహ్ ఆరాధన కోసం మేల్కొనకుండా ఉంటామో అని వారు భావించారు.. దాని మెత్తదనాన్ని గమనించారు. కాబట్టి, ఇది వారి ఆదర్శప్రాయమైన ప్రమాణం.

వారి ఆరాధన యొక్క స్థితిని విశ్వాసుల తల్లి, హజ్రత్ సౌదహ్ (రజి) ఈ క్రింది విధంగా వర్ణించారు: ఆమె ఇలా పేర్కొన్నారు, "ఒకసారి నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వెనుక నమాజ్ చేశాను, మరియు వారు ఎంతగా రుకూ చేశారనగా, చివరికి నేను నా ముక్కును పట్టుకోవలసి వచ్చింది." అంటే, ఆ రుకూ వలన నా ముక్కు నుండి రక్తం కారడం మొదలవుతుందేమోనని నేను భయపడ్డాను. (అల్-ఇసాబహ్ ఫీ తమీజిస్సహాబహ్, కితాబ్-ఉల్-నిసా, సంపుటి 8, దారులంఎ కుతుబుల్ ఇల్మియా, 1995, పేజీలు 196-197)

అయినప్పటికీ, ఒక వ్యక్తి తన ప్రియమైన వారి గడపను విడిచి వెళ్ళడానికి ఇష్టపడనంతటి ప్రేమ ఉన్నప్పుడు మాత్రమే ఈ పరిస్థితి సాధ్యమవుతుంది. వారు (స) ఏ భంగిమలో వెళ్ళినా, ఏ స్థితిలో వెళ్ళినా, దానిలో పూర్తిగా లీనమైపోతారు.

అదేవిధంగా, ఆరాధన ప్రమాణానికి సంబంధించి, ముతర్రఫ్ తన తండ్రి నుండి మరొక కథనాన్ని వివరించారు. ఆయన ఇలా అంటారు: "అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నమాజ్ చేస్తుండగా నేను చూశాను, వారు ఏడుస్తున్నందువల్ల, వారి ఛాతీ నుండి విసురు రాయి తిరిగే శబ్దం వంటిది వస్తోంది"

(సునన్ అబీ దావూద్, కితాబుస్సలాత్, హదీస్ 904).

దీని అర్థం ఏమిటంటే, ఒక విసురు రాయి పనిచేస్తున్నప్పుడు మరియు పిండి మర తిరుగుతున్నప్పుడు ఎలా ఉంటుందో, అలాంటి శబ్దమే వారి నుండి వెలువడుతోంది. మరొక కథనంలో, కుండలో నీరు మరిగే ఉదాహరణ కూడా ఇవ్వబడింది.

(సునన్ నిసాయి, కితాబ్ అస్సహూ, హదీసు 1214)

మరొక ఉల్లేఖనంలో ఇలా ప్రస్తావించబడింది: హజ్రత్ ముఆద్ బిన్ జబల్ (ర.అ) ఇలా వివరిస్తారు, "నేను దైవ ప్రవక్త (స.అ.స) వెనుక ఒక వాహనంపై కూర్చుని ఉన్నాను; ఆయనకు, నాకు మధ్య అంభారి మధ్య వెనుక భాగం అడ్డుగా ఉంది. వారు ఇలా అన్నారు: 'ఓ ముఆజ్ బిన్ జబల్!' నేను ఇలా బదులిచ్చాను: 'నేను సేవకు సిద్ధంగా ఉన్నాను, ఓ అల్లాహ్ ప్రవక్తా! ఇది నా అదృష్టం (గౌరవం).' ఆ తర్వాత వారు కొంత దూరం ప్రయాణించి, మళ్ళీ ఇలా అన్నారు: 'ఓ ముఆజ్ బిన్ జబల్!' నేను మరొకసారి ఇలా అన్నాను: 'నేను సేవకు సిద్ధంగా ఉన్నాను, ఓ అల్లాహ్ ప్రవక్తా! ఇది నా అదృష్టం.' ఆ తర్వాత వారు మరికొంత దూరం ప్రయాణించి, ఇలా అన్నారు: 'ఓ ముఆజ్ బిన్ జబల్!' నేను ఇలా అన్నాను: 'నేను సేవకు సిద్ధంగా ఉన్నాను, ఓ అల్లాహ్ ప్రవక్తా! ఇది నా అదృష్టం.' అప్పుడు దైవ ప్రవక్త (స.అ.స) ఇలా అడిగారు: 'అల్లాహ్ తన దాసుల పట్ల కలిగి ఉన్న హక్కులు ఏమిటో నీకు తెలుసా?' నేను ఇలా బదులిచ్చాను: 'అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స.అ.స)కే బాగా తెలుసు.' వారు ఇలా అన్నారు: 'అల్లాహ్ తన దాసుల పట్ల కలిగి ఉన్న హక్కు ఏమిటంటే, వారు కేవలం ఆయననే ఆరాధించాలి మరియు ఆయనకు ఎవరినీ సాటి కల్పించకూడదు.' ఆ తర్వాత వారు కొంత దూరం ప్రయాణించి, ఇలా అన్నారు: 'ఓ ముఆజ్ బిన్ జబల్!' నేను ఇలా అన్నాను: 'నేను సేవకు సిద్ధంగా ఉన్నాను, ఓ అల్లాహ్ ప్రవక్తా! ఇది నా అదృష్టం.' వారు ఇలా అడిగారు: 'దాసులు అల్లాహ్ పట్ల కలిగి ఉన్న హక్కులు ఏమిటో నీకు తెలుసా? (మొదట అల్లాహ్ హక్కు గురించి ప్రస్తావించారు; ఇప్పుడు దాసుల హక్కు గురించి. వారు ఆరాధన చేసిన తర్వాత, వారికి దక్కే హక్కులు ఏమిటి?)' నేను ఇలా బదులిచ్చాను: 'అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స.అ.స)కే బాగా తెలుసు.' వారు ఇలా అన్నారు: 'ఆయన వారిని శిక్షించకపోవడం (అంటే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన దాసులను శిక్షించకపోవడం)."

(సహీముస్లిం, కితాబుల్-ఈమాన్, హదీసు 35)

ఈ విధంగా, దైవ ప్రవక్త (స.అ.స) కేవలం తన సొంత ప్రమాణాలను మాత్రమే నెలకొల్పలేదు, ఆ ప్రమాణాలను చేరుకోవాలని ఇతరులకు కూడా ఉపదేశించారు. మీరు కూడా ఇదే విధంగా ప్రవర్తిస్తే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రేమను పొందుతారని మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ శిక్ష నుండి రక్షించబడతారని వారు బోధించారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ప్రశంసిస్తూ, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట ఇలా పేర్కొన్నారు: "పవిత్ర ఖురాన్‌ను ప్రచారం చేయడానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నియమించబడ్డారు, మరియు అదే విధంగా సున్నత్‌ను స్థాపించడానికి కూడా వారు నియమించబడ్డారు. అందువల్ల, పవిత్ర ఖురాన్ ఎంత నిశ్చయమైనది మరియు తిరుగులేనిదో, అలాగే వారు స్థాపించిన సున్నత్ కూడా నిశ్చయమైనది.అనగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వరకు చేరుకొను సాంప్రదాయ విధానం. వారి ఆచరణల ద్వార నిరూపించబడినదై ఉండాలి. కథకులు అవిచ్ఛిన్నమైన పరంపర ద్వారా నిరంతరం ప్రవక్త వరకు చేరుకోవాలి. కథకుల బంధనము ఉండాలి. ఈ రెండు సేవలను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా నెరవేర్చారు మరియు రెండింటినీ తన కర్తవ్యంగా భావించారు. నమాజ్ గురించిన ఆజ్ఞ అవతరించినప్పుడు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వాక్యాన్ని తన స్వంత ఆచరణ ద్వారా వివరించి, దానిని ఆచరణాత్మక రూపంలో ప్రదర్శించారు. ఈ విధంగా, ఫజర్ నమాజ్ యొక్క రకాతులు (రకాత్‌లు), మగ్రిబ్ నమాజ్ యొక్క రకాత్‌లు ఏమిటో వారు చేసి చూపించారు. మరియు అదే విధంగా మిగిలిన నమాజుల కోసం రకాత్‌లను నిర్దేశించారు. అదే పద్ధతిలో, వారు తన స్వంత ఉదాహరణ ద్వారా హజ్ ఆచరణను ప్రదర్శించారు, ఆ తర్వాత, వ్యక్తి గతంగా విధిగా పాటించడం ద్వారా... వేలాది మంది సహచరులు ఈ ఆచారాన్ని పాటించేలా చేసి, వారు ఒక శక్తివంతమైన మరియు శాశ్వతమైన ఆచరణాత్మక వ్యవస్థను దృఢంగా స్థాపించారు. వారు స్వయంగా ఈ చర్యలను ఆచరించి చూపించి, ఆ తర్వాత ఇతరులు కూడా వాటిని పాటించేలా చూశారు. ఈ విధంగా, ముస్లిం సమాజంలో ఒక స్థిరమైన ఆచరణగా నిరంతరం చూడబడుతూ మరియు ఆచరింపబడుతూ ఉన్న ఆ ఆచరణాత్మక నమూనానే సున్నత్ అని అంటారు." మరల ఇలా వ్రాసారు: "కాని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సమక్షంలో హదీసులు వ్రాయబడలేదు, అలాగే ఆ సమయంలో వాటి సంకలనం కోసం ఎటువంటి అధికారిక ఏర్పాటు కూడా చేయబడలేదు."

మొత్తానికి హుజూర్ (అ) సున్నత్ మరియు హదీసుల మధ్య వ్యత్యాసాన్ని స్పష్టం చేయడానికి వాటి మధ్య పోలికను చూపారు. హోదాలో సున్నత్ హదీసు కంటే ముందు ఉంటుందని, ఆ తర్వాత హదీసు స్థానం వస్తుందని హుజూర్ (అ) పేర్కొన్నారు. అంతేకాకుండా, పవిత్ర ఖురాన్‌తో గానీ లేదా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సున్నత్‌తో గానీ విభేదించని ఏ హదీసునైనా ప్రామాణికమైనదిగా పరిగణించాలి అని తెలిపారు. (రీవ్యూ ముబాహిస బటాల్వీ వా చడ్కాల్వీ, రుహానీ ఖజాయిన్, సంపుటి 19, పుటలు 210-212)

మొత్తానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్థాపించిన ఉన్నతమైన ఆరాధన ప్రమాణాలను ప్రశంసిస్తూనే, ప్రవక్త (స) ఈ చర్యలన్నింటినీ తన స్వంత ఆచరణ ద్వారా ప్రదర్శించారని, తన అనుచరులను వాటిపై నడుచుకోమని ప్రోత్సహించారని, మరియు వారు అలా చేసేలా చూసుకున్నారని కూడా హుజూర్ (అ) స్పష్టం చేశారు. ఇదే, ఈ రోజు వరకు మనకు చేరుతూ వస్తున్న సున్నత్. మనకు అందించబడిన మహనీయ సహచరుల ఆదర్శప్రాయమైన నమూనాలు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అందించిన శిక్షణ యొక్క ప్రత్యక్ష ఫలితమే. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సహచరులకు శిక్షణ ఇచ్చిన తీరు వలన, వారి ఆరాధన ప్రమాణాలు నిరంతరం ఉన్నత స్థాయికి చేరుకుంటూ పోయాయి మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల వారి ప్రేమ కూడా అదే విధంగా వృద్ధి చెందింది. ఇది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్థాపించిన ఉన్నతమైన ఆదర్శం. దీనిని వారి (స) సహచరులు స్వీకరించారు మరియు ఇది మనకు కూడా అట్టి ఆదేశంగా నిలుస్తుంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తహజ్జుద్ నమాజు యొక్క ప్రాముఖ్యతను ఎంతగానో నొక్కిచెప్పారు మరియు దానిని క్రమం తప్పకుండా ఆచరించాలని ఉద్బోధించారు.

ఒక చోట దీనిని వివరిస్తూ, హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ రజి ఇలా వ్రాశారు: "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ ఐచ్ఛిక (తహజ్జుద్) ప్రార్థనలకు ఎంత ప్రాముఖ్యత ఇచ్చారంటే, అవి ఐచ్ఛికమైనప్పటికీ, సహచరులలో ఎవరు వాటిని చేస్తున్నారో గమనించడానికి వారు స్వయంగా రాత్రిపూట బయటకు వెళ్ళేవారు. (అంటే, ప్రవక్త (స) నగరంలోని వీధులు మరియు మార్గాలలో నడిచేవారు, మరియు ప్రార్థనల శబ్దాల నుండి, తహజ్జుద్ సమయంలో ఎవరు ఆరాధన కోసం లేచారో, ఎవరు లేవలేదో స్పష్టమయ్యేది.) ఈ విధంగా, ఎవరు తహజ్జుద్ ప్రార్థన చేస్తున్నారో, ఎవరు చేయడం లేదో కూడా వారు (స) గమనించేవారు."

| **అహ్‌దీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

| **అహ్‌దీస్ బోధనలు** | **"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

**దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, Mahboobnagar, (Telangana)***

ఇందుకు భిన్నముగా నేడు, ఎవరినైనా వారి నమాజ్‌ల గురించి అడిగినా, లేదా మసీదులో నమాజ్‌లు చేయమని కేవలం సలహా ఇచ్చినా, లేదా ఎవరైనా ప్రతిరోజూ సామూహికంగా ఎన్ని నమాజ్‌లకు హాజరవుతారని అడిగినా, ప్రజలు వెంటనే అభ్యంతరం చెప్పడం ప్రారంభిస్తారు. ఇది ఒకరి వ్యక్తిగత విషయం, అభ్యంతరం చెప్పడానికి ఎవరికి హక్కు ఉంది లేదా అడగడానికి జమాత్‌కు ఏ హక్కు ఉంది, ఎందుకంటే ఇది వారికి మరియు దేవునికి మధ్య ఉన్న వ్యక్తిగత విషయం! అని అంటారు. అయినప్పటికీ, నిజానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా తహజ్జుద్ నమాజును కూడా లెక్కలోకి తీసుకునేవారు.

“ఒక సందర్భంలో, వారి సభలో హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ రజి గురించి ప్రస్తావించబడింది, ఆయన చాలా మంచి వ్యక్తి అని మరియు అనేక ప్రశంసనీయమైన గుణాలను కలిగి ఉన్నారని చెప్పబడింది. అప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వ్యాఖ్యానించారు, ‘అవును, అతను నిజంగా చాలా మంచివాడే, అయితే అతను తహజ్జుద్ నమాజ్ చదివినచో,’ ఎందుకంటే అతను యువకుడు మరియు తహజ్జుద్ నమాజును క్రమం తప్పకుండా ఆచరించేవాడు కాదు, అందువల్ల దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా అతని దృష్టిని అటు వైపు మళ్లించారు.

“మరల దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా పేర్కొన్నారు, అల్లాహ్ ఏ ఇంట్లోనైతే భర్త రాత్రిపూట మేల్కొన్నప్పుడు, అతను తహజ్జుద్ నమాజు చేయడానికి సిద్ధమవుతూ, తన భార్యను కూడా మేల్కొలిపి, ఆమెను కూడా నమాజ్ చేయమని ప్రోత్సహిస్తాడో, ఒకవేళ ఆమె మేల్కొనకపోతే, అతడు ఆమెను మేల్కొలపడానికి ఆమె ముఖం మీద నీళ్ళు చల్లుతాడో. అదేవిధంగా, ఒకవేళ భార్య ముందుగా మేల్కొంటే, ఆమె స్వయంగా తహజ్జుద్ నమాజ్‌కు సిద్ధమై, తన భర్తను మేల్కొలపాలి, అతడు మేల్కొనకపోతే, ఆమె అతని ముఖం మీద నీళ్ళు చల్లుతుందో అట్టి భార్య భార్తలపై అల్లాహ్ కరుణను చూపిస్తాడు. ” ఒకవైపు, భార్య తన భర్త పట్ల తగిన గౌరవం చూపడం చాలా ముఖ్యమని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రకటించారు, అయినప్పటికీ, మరోవైపు, తహజ్జుద్ నమాజు కోసం ఒకరినొకరు మేల్కొలపడం కొరకు ముఖంపై నీళ్ళు చల్లుకోవడాన్ని కూడా వారు అనుమతించారు. ఈ విషయం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తహజ్జుద్ నమాజును ఎంత అత్యవసరమైనదిగా పరిగణించారో స్పష్టంగా తెలియజేస్తుంది.

“రాత్రిపూట నిద్రలేవడం ఆత్మను క్రమశిక్షణలో పెడుతుందని పవిత్ర ఖురాన్ చెబుతోంది, అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సహచరులతో ఇలా అనేవారు, ‘మీరు తహజ్జుద్‌లో కేవలం రెండు రకాతుల నమాజ్ మాత్రమే చేయగలిగినప్పటికీ, దానిని నిర్లక్ష్యం చేయకండి.రాత్రి చివరి భాగంలో అల్లాహ్ సమీపించి అనేక నమాజులను స్వీకరిస్తాడని హదీసుల కథనాలు కూడా ధృవీకరిస్తున్నాయి. అందువల్ల, తహజ్జుద్ చాలా ప్రాముఖ్యమైనది మరియు అపారమైన ప్రయోజన కరమైనది.” (సిరాతున్నబి,సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 1, పుట 416–417)

మోక్షం కేవలం దైవ కృప ద్వారానే లభిస్తుందనడంలో సందేహం లేదు; ఏ వ్యక్తి కూడా తన కర్మల కారణంగా మోక్షాన్ని పొందగలనని చెప్పుకోలేడు. కర్మలలో అత్యంత పరిపూర్ణుడు మరియు అల్లాహ్‌కు అత్యంత విధేయుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం), అయినప్పటికీ వారు కూడా తన కర్మలపై ఆధారపడలేదు. నేను గత ఉపన్యాసంలో ప్రస్తావించిన హదీసులో వివరించినట్లుగా, హజ్రత్ ఆయిషా (రజి) మరియు ఇతరులు, “మీ కర్మల వల్ల మీరు స్వర్గంలో ప్రవేశించరా?” అని అడిగినప్పుడు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారితో ఇలా అన్నారు, “లేదు, ఆయిషా(రజి), నేను అల్లాహ్ కృప ద్వారా మాత్రమే స్వర్గంలో ప్రవేశిస్తాను.” కావున ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వంటి వారు, వారి యొక్క ప్రతి శ్వాస, ప్రతి కదలిక మరియు ప్రతి క్రియ ఆరాధనే; వారి నిద్ర, మెలకువ కూడా భక్తి కార్యాలే; వారు చేసే ప్రతి పని, వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవడం లేదా తన భార్యలను సమీపించడం వంటివి కూడా ఆరాధనగానే పరిగణించబడ్డాయి, అటువంటి భక్తిశ్రద్ధలు గల ఆరాధకుడే తాను తన కర్మల మీద కాకుండా దైవ కృపపైనే ఆధారపడతానని ప్రకటించినప్పుడు, మనలో ఎవరు కేవలం కర్మల ద్వారానే స్వర్గంలో ప్రవేశిస్తామని చెప్పుకోగలరు?. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రతి చర్య ఎలా ఆరాధన అయిందో అనే దానిపై దృష్టి కేంద్రీకరించవద్దు. ఎందుకంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్వయంగా వారి యొక్క ప్రతి స్థితిని ఆరాధన అని ప్రకటించాడు. ఒక అజ్ఞాని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)గారి ప్రతి చర్యను ఆరాధనగా ఎలా పరిగణించగలరని ప్రశ్నించవచ్చు, కానీ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రతి కార్యం ఆరాధన అనే విషయం పూర్తిగా నిజమని మనం గుర్తుంచుకోవాలి. ఇది వారికి తప్ప మరెవరికీ వర్తించదు. వారే పరిపూర్ణ ఆదర్శం, మరియు వారు (స) చేసిన పనులన్నీ కేవలం దేవుని ప్రీతి కోసమే చేయబడ్డాయి. కేవలం దేవుని ప్రీతి కోసం చేసే ఏ పనైనా ఆరాధన అవుతుంది. కాని ఇతర వ్యక్తుల ప్రతి పని ఆరాధన కాదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: “లకుమ్ ఫీ రసూలుల్లాహి హుస్వతున్ హసనతున్” అనగా, మీ కొరకు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రతి చర్యలోనూ ఒక ఆదర్శం ఉన్నది. కావున ఏ పనులు ధర్మసమ్మతమైనవి, ఏవి ధర్మవిరుద్ధమైనవి, ఏవి ప్రశంసనీయమైనవి, ఏవి నిందనీయమైనవి, ఏవి అనుమతించబడినవి, ఏవి నిషేధించబడినవి అని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన చర్యల ద్వారా ఆచరించి చూపాలి కదా? అని దీని అర్థం కాదా!. వారు చేసిన ప్రతి చర్య ఒక బోధన మరియు ఒక వివరణ. ఉదాహరణకు, వారి ప్రార్థనలు కేవలం దైవిక ఆజ్ఞకు విధేయత చూపడం మాత్రమే కాదు; అవి ఒక ప్రకటనగా ఉండేవి: “ఇవి విధిగా చేయవలసిన ప్రార్థనలు, ఇవి సున్నత్ ప్రార్థనలు, మరియు ఇవి ఐచ్ఛిక ప్రార్థనలు, విధిగా చేయవలసిన ప్రార్థనలకు భిన్నమైనవి, ఇవి ఒకరిని దేవునికి దగ్గర చేయడానికి అవసరమైనవి.” అదేవిధంగా, వారు భోజనం చేయడం కూడా, వారు భుజించునది ధర్మసమ్మతమైనదని మరియు వారు తినకుండా ఉన్నది ధర్మసమ్మతయోగ్యమైనది కాదని చేసిన ఒక బహిరంగ ప్రకటన. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రతి చర్య మానవాళికి ఒక ఉదాహరణగా ఉండేది కాబట్టి, వారు అనుమతించిన లేదా ఆచరించిన ప్రతిదీ ఒక ఆరాధన రూపంగా మారింది, మరియు వారు నిషేధించిన లేదా దూరంగా ఉన్న ప్రతిదీ కూడా ఆరాధన పరిధిలోకి వచ్చింది. అందువల్ల, వారి చర్యలన్నీ ఆరాధనలే, ఎందుకంటే ప్రతిదీ సర్వశక్తిమంతుడైన దేవుని ఆజ్ఞకు అనుగుణంగా ఉండేది. ఉదాహరణకు, ఒకసారి ఒక వ్యక్తి అసర్ నమాజ్ సమయం గురించి అడిగాడు. సాధారణంగా, నమాజ్‌ను దాని తొలి సమయంలోనే చేయడం అత్యంత శ్రేయస్కరం, కానీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సమయం ముగిసిపోయే వరకు అసర్ నమాజ్‌ను ఆలస్యం చేశారు. ఆ ఆలస్యం కూడా ఒక రకమైన ఆరాధనే, ఎందుకంటే వారు బోధించినదేమంటే, ఒకవేళ ఎవరైనా ఏదైనా కారణం చేత తొలి సమయంలో నమాజ్ చేయలేకపోతే, దాని నిర్దేశిత సమయం ముగియక ముందే చేసినా కూడా ఆ నమాజ్ చెల్లుబాటు అవుతుంది. అందువల్ల, వారు విధులలో, విధిగా చేయవలసిన పనులలో, మరియు ఐచ్ఛిక భక్తి కార్యక్రమాలలో, స్థిరపడిన ఆచారాలలో, ఇవన్నీ దేవుడిని ఆరాధించే రూపాలేనని చాటిచెప్పాయి. ఇవన్నీ ఉన్నప్పటికీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తాను కేవలం దైవ కృప వలనే స్వర్గంలోకి ప్రవేశిస్తానని చెప్పారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారి కర్మలన్నింటిని ఆరాధనలే అని ప్రకటించినప్పటికీ, “నేను అల్లాహ్ అనుగ్రహం వలన స్వర్గంలో ప్రవేశిస్తాను.” అని వారు తెలిపారు. అయితే, అల్పమైన కర్మలు కలిగిన మనం, మన కర్మల వలన స్వర్గంలోకి ప్రవేశిస్తామని ఎలా చెప్పుకోగలం?.ఇది దైవిక అనుగ్రహం ఎంత అనివార్యమో స్పష్టం చేస్తుంది.

అల్లాహ్ అనుగ్రహం చాలా ముఖ్యమైనది. అయినప్పటికీ, ఆ అనుగ్రహం కేవలం మాటలతోనో లేదా విశ్వాసపు వాదనలతోనో లభించదు. ఎందుకంటే దానికి కూడా ఇంకేదో అవసరం. కేవలం విశ్వాసం ఉందని చెప్పుకోవడంలో ఎలాంటి బలం లేదు. దానికి ఏమి అవసరం? దానికి కర్మలలో కృషి అవసరం. అది దైవ ప్రవక్తా సాధకుల ఆచరణలను అనుసరించడం, తమరి ఆరాధన స్థాయిని ఉన్నతీకరించడానికి కృషి చేయడం, మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రేమను కోరడం. నేను ప్రారంభంలో చెప్పినట్లుగా, దైవ ప్రేమ లేకుండా ఆరాధన ఉండదు, అలాగే ఆరాధన లేకుండా దైవ ప్రేమ ఉండదు. (ఖుత్బాతే మహమూద్, సంపుటి 7, పేజీ 111–112)

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ప్రార్థన విధానం గురించి, హజ్రత్ ముస్లేహ్–ఎ–మౌవూద్ రజి తమ వ్యాఖ్యానంలో ఇలా వ్రాశారు .దానిలోని కొన్ని విషయాలను నేను నా సొంత మాటలలో ప్రస్తావిస్తాను; అయినప్పటికీ, ఇది వారి (రజి)గారి ఉల్లేఖనం నుండి గ్రహించబడినదే. చాలా మంది ప్రార్థన చేస్తారు, కానీ వారి కళ్ళు, హృదయాలు, మనస్సులు మరియు ఆత్మలు వారి ప్రార్థనకు సహకరించవు. వారు ప్రార్థన చేస్తారు, కానీ వారి కళ్ళు చెదిరిపోతాయి, వారి హృదయాలు సంబంధం లేకుండా ఉంటాయి, వారి మనస్సులు పరధ్యానంలో ఉంటాయి, మరియు వారి హృదయాలలో తీవ్రమైన దైవ ప్రేమ ఉండదు. అల్లాహ్ తాలా కొరకు అట్టి ప్రేమ వారిలో ఉండదు. అందువలన ఎలాంటి ఫలితం వెలువడుతుంది?. ఫలితం ఏ విధముగా వెలువడుతుందనగా, వారి హృదయాలు మరియు మనస్సులు వారి ప్రార్థనకు సహకరించ నందున, వారి ప్రార్థన ఒక డొల్ల లాంఛనంగా మిగిలిపోతుంది. వారి కళ్ళు చెమ్మగిల్లవు; వారి హృదయాలు కరగవు. నిజమైన ప్రార్థనలో, ఒకరి కళ్ళు కన్నీళ్లతో నిండిపోవాలి, హృదయం ఆప్యాయతతో కరిగిపోవాలి, మరియు మనస్సు పూర్తిగా దేవుని వైపు మళ్ళాలి. వారి హృదయం ఉద్వేగంతో ఉప్పొంగనప్పుడు, వారి ప్రార్థన కూడ గాలిలో ఎగిరే ధూళిలా ఎగురుతూ చెదిరిపోతుంది.

మానవులలో అత్యంత స్వయం సమృద్ధి గల మరియు గౌరవనీయులు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాకుండా మరెవరు కాగాలరు?. అయినా కూడ ప్రార్థనల సమయంలో, వారి చాతిలో నుండి దేగులు మరిగే శబ్దాలు వెలువడేవి, మరియు వారు ఎంతగా ఏడ్చేవారంటే వారి గడ్డం కన్నీళ్లతో తడిసిపోయేది.

కాని, చాలా మంది ప్రజలు, గర్వం మరియు అలవాటు కారణంగా, దేవుని ముందు కూడా, ప్రార్థనలో ఏడవడాన్ని తృణీకరిస్తారు.

(సిరాతున్నబి సల్లల్లాహు అలైహి వసల్లం, సంపుటి 2, పుట 149).

నమాజ్‌లలో భక్తిశ్రద్ధలను పెంపొందించుకోవడం కూడా అత్యంత ముఖ్యం. దీనిని సాధించడానికి ప్రతి ఒకరు ప్రయత్నం చేయాలి. అలా చేయడానికి, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక ఆచరణాత్మక పరిష్కారాన్ని అందించారు: ఒకరు తమ ముఖ కవళికలను ఏడుస్తున్నట్లుగా పెట్టుకోవాలి. ఎందుకంటే ఆ బాహ్య స్థితి

| | |
|---|---|
| **వర్తమాన ఖలీఫా వాఖ్యములు** | **“అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. ” (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)** |

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*



హృదయంపై ప్రభావం చూపుతుంది, అప్పుడు కన్నీళ్లు సహజంగా ప్రవహించడం ప్రారంభిస్తాయి. (మల్ఫూజాత్, సంపుటి 7, పేజీ 79, ముద్రణ 2022)

ఈ విధంగా,దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ఆరాధన యొక్క ప్రమాణాలను అనగా, వారు ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉండటం, అల్లాహ్ అనుగ్రహం తనను కాపాడుతుందని గుర్తించడం, మరియు ఈ అనుగ్రహాన్ని పొందడం కోసం అల్లాహ్ యొక్క దీవెనలకు కృతజ్ఞతను తెలియజేయడం వంటివి అని మనకు బోధించారు. అంతేకాకుండా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్వయం సమృద్ధి గలవాడు కాబట్టి, తాను కృతజ్ఞతతో ఉండకపోతే, అల్లాహ్ తనతో ఎలా వ్యవహరిస్తాడో చెప్పలేమని వారు భావించినట్లు కూడా నిరూపించారు. అందువల్ల, సకల సజ్జనులకు అధిపతి అయిన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వంటి వారే సత్కర్మలు చేయడం నుండి తమను తాము విముక్తులుగా భావించుకోనప్పుడు, ఇంకెవరైనా వాటి నుండి విముక్తులుగా ఉన్నామని ఎలా చెప్పుకోగలరు? తాము ఇప్పుడు కర్మలు చేయవలసిన అవసరం నుండి విముక్తులయ్యామని, తమకు సత్కర్మలు చేయవలసిన అవసరం లేదని, మరియు ఏదేమైనా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తమను క్షమిస్తాడని ప్రజలు ఎలా చెప్పగలరు? ఇటువంటి ప్రకటనలు అవిశ్వాసులు మాత్రమే చేయగలరు, విశ్వాసులు కాదు.

(సిరతున్నబి సల్లల్లాహు అలైహి వసల్లం సంపుటి 2, పుట 183)

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి దైవ స్మరణ కూడ సున్నత్. వారు క్రమం తప్పకుండా అల్లాహ్ స్మరణలో నిమగ్నమయ్యేవారు. ఈ విషయంను గూర్చి హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ రజి ఒకసారి ఒక ఉపన్యాసంలో నిద్రపోయే సమయంలో చేసే స్మరణ కూడా ఒక రూపమే అని వివరించారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నిద్రపోవడానికి ముందు, ఆయత్ అల్-కుర్సీతో పాటు, పవిత్ర ఖురాన్‌లోని చివరి మూడు అధ్యాయాలైన సూరహ్ -ఇఖ్లాస్, సూరహ్ -ఫలఖ్ మరియు సూరహ్-నాస్‌లను మూడుసార్లు పఠించి, ఆ తర్వాత తన చేతుల్లోకి ఊది, తన చేతులను శరీరంపై రాసుకునేవారు. వారు (స) తల నుండి ప్రారంభించి, తన చేతులు ఎంత దూరం చేరగలవో అంత దూరం శరీరంపై రాసుకునేవారు. ఇది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సున్నత్. వారు(స) స్థిరంగా మరియు క్రమం తప్పకుండా ధార్మిక ఆచారంగా పాటించే ఏ కార్యాన్నైనా సున్నత్ అంటారు.

వారు (స) ఎల్లప్పుడూ ఈ స్మరణ పద్ధతిని, అంటే ఆయత్ అల్-కుర్సీ మరియు పవిత్ర ఖురాన్‌లోని చివరి మూడు అధ్యాయాల పఠనాన్ని పాటించేవారు. కాబట్టి, ప్రతి ముస్లిం ఈ సున్నత్‌కు కట్టుబడి ఉండాలి మరియు వాస్తవానికి, దీనిని తమ జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా చేసుకోవాలి.

అందువల్ల, అల్లాహ్ స్మరణ పూర్తిగా అవసరం కాదనీ, దానిని విస్మరించడం నరకానికి దారితీయదనీ భావించి దానిని విడిచిపెట్టకూడదు; అలాగే, ఎలాంటి కర్మలు చేయనవసరం లేకుండా, కేవలం అల్లాహ్ స్మరణ మాత్రమే స్వర్గానికి చేరడానికి సరిపోతుందని కూడా భావించకూడదు.

విధిగా చేయవలసిన పనులను కూడా నెరవేర్చాలి. కొందరు నాకు లేఖలు రాస్తూ, తాము పుణ్యాన్ని పెంపొందించుకోవడానికి, తమ పాపాలు తొలగిపోవడానికి, తమ వ్యవహారాలు చక్కబడటానికి, మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు సామీప్యాన్ని పొందడానికి, ఆచరించగల ఒక చిన్న దుఆ లేదా స్మరణను అడుగుతారు. అన్నింటికన్నా ప్రధానమైన ఆచరణ నమాజ్. అంటే, విధిగా చేయవలసిన ప్రార్థనలు. విధిగా చేయవలసిన ప్రార్థనలతో పాటు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఐచ్ఛిక ప్రార్థనలు కూడా చేసేవారు. అందువల్ల, ఒక వ్యక్తి మొదట సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముందు నమాజ్‌లో తనను తాను సమర్పించుకునే ప్రమాణాలను సాధించాలి. ఆ తర్వాత ఐచ్ఛిక ప్రార్థనలు, ఆపై అల్లాహ్ స్మరణ వస్తాయి. అల్లాహ్ స్మరణ ఒక వ్యక్తిని సద్గుణం వైపు నడిపిస్తుంది, కానీ అదే సమయంలో ఇతర నైతిక గుణాలను కూడా అలవర్చుకోవాలి. ఒక వ్యక్తి ఉన్నతమైన నైతిక నడవడిని అలవర్చుకోవాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సామీప్యాన్ని పొందడానికి, ఒకరి సమస్యలను పరిష్కరించుకోవడానికి, మరియు ఒకరి ప్రార్థనలు అంగీకరించబడటానికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ప్రతి ఆజ్ఞపై మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చూపిన పద్ధతిలో ఆచరించడం అత్యవసరం. దీనికోసం కృషిచేయాలి మరియు సంపూర్ణ సున్నత్‌కు కట్టుబడి ఉండాలి.

ఏదేమైనా, అల్లాహ్ స్మరణను విడిచిపెట్టడం నరకానికి దారితీస్తుందని గానీ, లేదా కేవలం అల్లాహ్‌స్మరణ మాత్రమే స్వర్గానికి దారితీస్తుందని గానీ, లేదా అన్ని సమస్యలను పరిష్కరిస్తుందని గానీ ఎవరూ భావించకూడదు. కర్మలు అవసరం, మరియు విధిగా చేయవలసిన పనులను నెరవేర్చడం కూడా అవసరం. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వంటి వారు తమ ఆధ్యాత్మికరి పురోగతి కోసం అల్లాహ్ స్మరణను ఉచ్చరించినప్పుడు, మనకు అల్లాహ్ స్మరణ అవసరం లేదని మనం ఎలా చెప్పగలం? దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నిద్రపోవడానికి ముందు, పైన పేర్కొన్న విధంగా, ఆయతుల్-కుర్సీని మరియు పవిత్ర ఖురాన్‌లోని చివరి మూడు అధ్యాయాలను మూడుసార్లు పఠించి, ఆ తర్వాత తన చేతుల్లోకి ఊది, వాటిని తన శరీరంపై రాసుకోవడం వారి సున్నత్. (ఖుత్బాతే మహమూద్, సంపుటి 11, పేజీలు 19-21)

హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ రజి ఇతర విషయాలను కూడా చాలా వివరంగా ప్రస్తావించారు. ఒక సందర్భంలో, మత నాయకులుగా మారిన వారు తరచుగా తమ ఆరాధన మరియు దైవ స్మరణ ఇతరుల కంటే ఎక్కువగా ఉండాలని భావిస్తారని వారు (రజి) రాశారు. తమను తాము పండితులుగా లేదా మతసంస్థల అధిపతులుగా భావించుకునే కొందరు మత నాయకులు, తమ ఆరాధనలు సాధారణ ప్రజల ఆరాధనను మించి ఉండాలని నమ్ముతారు. ఈ ఉద్దేశ్యంతో, ఇతరులు తమను భక్తిపరులుగా భావించాలనే ఉద్దేశంతో వారు ఉద్దేశపూర్వకంగా కృత్రిమ విధానాలను అవలంబిస్తారు. ఇప్పుడు ప్రధాన నాయకులు, రాజకీయ నాయకులు కూడా ఇలాంటి పద్ధతులను అవలంభించడం ప్రారంభించారు, దీనిలో భాగంగా వారి చేతులలో జపమాల కనిపిస్తుంది. మసీదుల ఇమామ్‌లు లేదా సంస్థలలోని పదవులలో ఉన్నవారు తమను తాము ప్రపంచానికి ఆదర్శంగా ప్రదర్శించుకుంటారు లేదా తాము ఆదర్శప్రాయులమనే అభిప్రాయాన్ని కలిగించడానికి ప్రయత్నిస్తారు. తమను తాము ఆదర్శంగా భావిస్తూ, వారు నటనకు, బాహ్య ప్రదర్శనకు పాల్పడతారు. ఇలాంటి ధోరణులు ముస్లిం, ముస్లిమేతర నాయకులలో సమానంగా కనిపిస్తాయి, మరియు కొన్ని తెగల సంప్రదాయాలలో కూడా ఉన్నాయి. ఏదేమైనా, ముస్లింలలో ఈ బాహ్య ప్రదర్శన వజూ (శుద్ధి) వంటి విషయాల ద్వారా వ్యక్తమవుతుంది. వారు దానిని అత్యంత శ్రద్ధతో చేస్తారు, తమ అవయవాలను ఎక్కువసేపు కడుక్కుంటారు, వజూ చేసేటప్పుడు పడే నీటి చుక్కలు శరీరాన్ని తాకకూడదని, అలా చేస్తే అపవిత్రత కలుగుతుందని కూడా వాదిస్తారు. వారు కేవలం ప్రదర్శన కోసమే వినయం, విధేయత అనే బాహ్య రూపాన్ని ప్రదర్శిస్తూ, తమ సజ్దాలను, ప్రార్థనలో రుకూలను దీర్ఘంగా సాగదీస్తారు. ఒకవేళ ఇది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రేమను పొందడానికి చేసినట్లయితే, అదివేరే విషయం, కానీ దీనిని కేవలం ప్రపంచాన్ని ఆకట్టుకోవడానికే చేస్తారు. వారు బహిరంగంగా దీర్ఘ దుఆలననఱ పఠిస్తారు, చేతులలో జపమాల పట్టుకొని, పైకి దైవ స్మరణలో నిమగ్నమైనట్లు కనిపిస్తారు. అయితే, అత్యంత దైవభీతి గలవారు, అత్యంత ధర్మవంతులు, మరియు దైవభీతిలో ఎలాంటి సాటి లేని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విషయాలన్నింటిలోనూ నిరాడంబరతను పాటించారు. వారి (స) జీవితం ఇటువంటి ఆడంబరాలకు పూర్తిగా దూరంగా ఉంది.

హజ్రత్ అబూ ఖతాదహ్ (రజి)ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: “కొన్నిసార్లు, నేను నమాజును పొడిగించాలనే ఉద్దేశ్యంతో నిలబడతాను, కానీ ఒక బిడ్డ ఏడుపు విన్నప్పుడు, ఆ బిడ్డ తల్లికి కష్టం కలగకూడదనే ఆందోళనతో నా నమాజును సంక్షిప్తం చేస్తాను.” దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నిరాడంబరత ఎంత గొప్పదంటే, ఒక బిడ్డ ఏడుపు వినగానే వారు తన నమాజును త్వరగా ముగించేవారు. నేటి సూఫీలు అలా చేయడాన్ని తమ అగౌరవంగా భావించవచ్చు. తాము నమాజులో ఎంతగా లీనమవుతామంటే, తమకు స్పృహ కూడా తెలియదని, తమ పక్కన డప్పులు మోగినా కూడా తమకు ఏమీ కాదని ప్రకటించుకోవడంలో వారు గర్వపడతారు. కానీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అటువంటి ఆడంబరాలకు అతీతులు. వారి గొప్పతనం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసాదించింది, మానవులు ఇచ్చినది కాదు. వారు ప్రజల నుండి ఏమీ కోరలేదు. వారు గొప్పతనాన్ని కేవలం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి మాత్రమే కోరారు. అందువల్ల, వారు ఈ ఆర్భాటాలకు అతీతులు. గౌరవం ప్రజల ద్వారా లభిస్తుందని విశ్వసించేవారు మాత్రమే ఇటువంటి భావాలను కలిగి ఉంటారు. గౌరవానికి మూలం మనిషే అని భావించేవారిలో మాత్రమే ఇటువంటి ఆడంబరం కనిపిస్తుంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నెలకొల్పిన మరియు వారు స్వయంగా చూపిన పద్ధతిని అనుసరించి, అల్లాహ్‌ను గౌరవానికి నిజమైన ప్రదాతగా భావించేవారు ఎన్నడూ ఇటువంటి భావాలను కలిగి ఉండరు. వారిలో నిరాడంబరత కనిపిస్తుంది, మరియు వాస్తవానికి అది అలానే ఉండాలి.

హజ్రత్ అనస్ రజి ఇలా ఉల్లేఖించారు: ఒక సందర్భంలో, తనను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎప్పుడైనా బూట్లు ధరించి నమాజ్ చేశారా? అని అడిగారు. ఒకవైపు ఆరాధనలు మరియు ఉన్నత ఆధ్యాత్మిక ప్రమాణాల కోసం చేసే ప్రయత్నాలు ఉన్నాయి. మరోవైపు సౌలభ్యం. అవసరమైన చోట, ఇస్లాం సౌలభ్యాన్ని కూడా అందిస్తుంది. అసర్ నమాజ్ సమయం విషయంలో నేను వివరించినట్లే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. అయినప్పటికీ, వాస్తవం ఏమిటంటే, అల్లాహ్‌ను ఆరాధించడం మరియు ఆయన అనుగ్రహాన్ని పొందడమే అన్నింటికన్నా ముఖ్య లక్ష్యంగా ఉండాలి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బూట్లు ధరించి నమాజ్ చేసేవారా? అని హజ్రత్ అనస్రాను అడిగినప్పుడు, ఆయన అవునని సమాధానమిచ్చారు. ఈ సంఘటన నుండి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనవసరమైన లాంఛనాలను మరియు అక్రమమైన ఆంక్షలను ఎలా నివారించారో స్పష్టమవుతుంది. నేటి ముస్లింలలో కొందరికి విశ్వాసం మరియు ఇస్లాం యొక్క నిజమైన సారం మరియు దాని బోధనలు తెలియనివారు. ఎవరైనా బూట్లు ధరించి నమాజ్ చేయడం చూస్తే, వారు గొడవ చేస్తారు. ఒక వ్యక్తి వారి ఊహల ప్రకారం ప్రతి షరతును నెరవేర్చకపోతే, వారు అతడిని చూడటాన్ని కూడా సహించలేరు. కానీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మనకు సంపూర్ణ ఆదర్శం. అనవసరమైన లాంఛనాలకు వెళ్ళకుండా, పరిస్థితుల వాస్తవికతను పరిగణనలోకి తీసుకోవడమే వారి ఆచరణ. ఇలాంటి వైఖరులు నేటికీ కొనసాగుతున్నాయి. ఒక అహ్మదీ నాకు వ్రాస్తూ, ఎవరో తనకు అభ్యంతరం తెలుపుతూ, “మీరు ఫలానా మాటలు అన్నారు, లేదా మీరు కలిమా పఠించారు” అని అన్నారని వివరించారు. దీనికి ఆయన ఇలా జవాబిచ్చారు, “మీరు కనీసం నమాజ్ కూడా చేయరు; మీకు నమాజ్ చేయడం ఎలాగో తెలియదు, పవిత్ర ఖురాన్‌ను కూడా చదవలేదు. ఈ విషయాలతో మీకు ఏమి సంబంధం?” ఆయన ఇంకా ఇలా అన్నారు, ఒకరికి నమాజ్ చేయడం ఎలాగో తెలిసినా తెలియకపోయినా, “మీరు ఒక అహ్మదీ, ఒక మీర్జాయీ, ఒక ఖాదియానీ కాబట్టి, మీరు నమాజ్ చేయకూడదు, అలా చేయడం ఎలాగో కూడా తెలుసుకోకూడదు.” మన కాలంలో కూడా ప్రజల పరిస్థితి ఇలాగే ఉంది. వారు మనల్ని వ్యతిరేకిస్తారు, కానీ వారే స్వయంగా ఈ బోధనలను ఆచరించరు. ఏదేమైనా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను ఆరాధించడానికి పవిత్రత మరియు పరిశుభ్రత అనేవి ప్రాథమిక అవసరాలు, మరియు ఇది పవిత్ర ఖురాన్ మరియు హదీసుల ద్వారా స్థాపించబడింది. అందువల్ల, ఒకరి పాదరక్షలు శుభ్రంగా ఉండి, అపవిత్రతకు ఆస్కారం ఉన్న ప్రదేశాలలో ధరించకుండా, అవసరం వచ్చినప్పుడు వాటిని ధరించి నమాజ్ చేయడంలో ఎలాంటి హాని లేదు. దీనిని ఆచరించడం ద్వారా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ఉమ్మత్‌ను భవిష్యత్తు కోసం అనవసరమైన లాంఛనాలు మరియు కృత్రిమత్వాల నుండి విముక్తి చేసి, వారిపై ఒక గొప్ప అనుగ్రహాన్ని ప్రసాదించారు. నేడు ఇటువంటి విషయాలపై వాదోపవాదాలకు దిగుతూ, కఠినమైన కట్టుకథల పట్ల మోజుపడే ప్రజలు ఈ ఉన్నతమైన ఉదాహరణ నుండి ప్రయోజనం పొందాలి.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క మహిమను గానీ, సదాచారాన్ని గానీ తగ్గించని కార్యం, ఒక వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక స్థాయిని తగ్గించదు.

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail:
teluguweeklybadar@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 21 MAY 2026, Issue No 21.

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

(ఆ౦–హ్రజత్ (స)కీ సదా జిందగీ, అన్వార్–ఉల్–ఉలూమ్, సంపుటి 12, పేజీలు 517–519)

నమాజ్ స్థాపన అత్యంత ప్రాముఖ్యమైనది. ఇందులో స్వయంగా నమాజ్ చేయడం, ఇతరులను కూడా అలా చేయడానికి ప్రోత్సహించడం, మరియు దానిని చిత్తశుద్ధితో, భక్తిశ్రద్ధలతో చేయడం ఇమిడి ఉంటుంది. అంటే, వజూ (శుద్ధి) చేసుకున్న స్థితిలో, ప్రశాంతంగా మరియు శ్రద్ధగా, సామూహికంగా, మరియు దాని షరతులను పూర్తిగా పాటిస్తూ నమాజ్ చేయడం. హదీసులు చెబుతున్నదేమంటే, నమాజ్ అనేది దేవునికి మరియు ఆయన సేవకునికి మధ్య ఐక్యతకు ఒక సాధనంగా పనిచేస్తుంది. దాని ద్వారా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్, ప్రవక్త ద్వారా విశ్వాసులలో నింపాలని కోరుకునే ఆ దైవిక గుణం వారిపై అవతరిస్తుంది, మరియు వారు అల్లాహ్ యొక్క వర్ణంతో నిండిపోతారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సామూహిక నమాజుకు ఎంత ప్రాముఖ్యత ఇచ్చేవారంటే, ఒకసారి ఒక అంధుడు ఆయన వద్దకు వచ్చి ఇలా విన్నవించు కున్నాడు, “ఓ అల్లాహ్ ప్రవక్తా!, నా ఇల్లు మసీదు నుండి చాలా దూరంలో ఉంది, మరియు దానిని చేరుకోవడానికి నేను చాలా ఇబ్బంది పడుతున్నాను. అందువల్ల, మీరు అనుమతిస్తే, వర్షం పడే రోజులలో నేను నా నమాజును ఇంట్లోనే చేసుకోవాలను కుంటున్నాను.” మదీనాలో ఇళ్ళు మట్టితో నిర్మించబడ్డాయి, మరియు వర్షం పడినప్పుడు, వీధుల్లో నీరు నిలిచిపోయేది, దీనివల్ల ఇళ్ళ పక్కల నడవవలసి వచ్చేది. అందువల్ల, గోడలను వర్షపు నీటి నుండి రక్షించడానికి, వాటి అడుగుభాగాలలో రాళ్ళను ఉంచేవారు, తద్వారా నీరు మట్టి గోడలను పాడుచేయకుండా ఆ రాళ్ళను తాకుతూ ప్రవహిస్తుంది. ఆ అంధుడైన సహచరుడు వివరించినదేమంటే, నీటి కారణంగా అతను దారి మధ్యలో నడవలేడు, మరియు పక్కల నడిస్తే, అతనికి ఏమీ కనిపించదు, మరియు రాళ్ళు అతని పాదాలను గాయపరుస్తాయి, దీనివల్ల గాయపడటం లేదా కింద పడిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల అతను తన నమాజును ఇంట్లోనే చేసుకోవచ్చా అని అడిగాడు. అందుకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సమాధానమిచ్చారు, “సరే, నీవు అలా చేయవచ్చు; నీకు అలాంటి ఇబ్బంది కలిగినా అందులో నష్టమేమీ లేదు.” ఆ వ్యక్తి వెళ్ళిపోయిన తరువాత, కొద్దిసేపటికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరులతో, “అతన్ని వెనక్కి పిలవండి” అని అన్నారు. అతను తిరిగి వచ్చినప్పుడు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) “నీ ఇంటికి అజాన్ వినిపిస్తుందా?” అని అడిగారు. అతను ఇలా సమాధానమిచ్చాడు, “అవును, ఓ అల్లాహ్ ప్రవక్తా!అజాన్ నా ఇంటికి వినిపిస్తుంది.” అప్పుడు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు, “అజాన్ మీ ఇంటికి వినబడినచో, మార్గమధ్యంలో మీరు తడబడినా లేదా గాయపడినా సరే, మీరు మసీదుకు తప్పక రావాలి.” (తఫ్సీరే–కబీర్, సంపుటి 10, పేజీ 23–25)

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు: “నేను మళ్ళీ చెబుతున్నాను, అల్లాహ్ ప్రేమ అనే వృక్షాలు ఎవరిలో నాటబడి, పోషించబడతాయో, అటువంటి వ్యక్తులే వీరు. వారిపైనే శాశ్వతమైన, మధురమైన మరియు పవిత్రమైన ఫలాలు ఫలిస్తాయి. ఇది ఉకులుహా దాయిమున్ (ర్రాద్:36)ను పోలి ఉంటుంది. గుర్తుంచుకోండి, సూఫీ సాధకుల ఆధ్యాత్మిక ప్రయాణం తన తీవ్రతకు చేరుకునే స్థానం ఇదే. సాధకుడు ఈ దశకు చేరుకున్నప్పుడు, అతడు దేవుని సాక్షాత్కారం తప్ప మరేమీ చూడలేడు.”

హుజూర్ (అ) మరల ఇలా పేర్కొన్నారు: “ఒక వ్యక్తి ‘తాఅబ్బుద్’ (అంటే, ప్రార్థనను దాని సరైన రూపంలో సమర్పించడం. ఇదే ప్రార్థన యొక్క నిజమైన సారాంశంగా పరిగణించబడుతుంది) అనే స్థితికి చేరుకున్నప్పుడు, ఆ స్థితిలో అతడు అల్లాహ్‌ను మాత్రమే స్మరిస్తాడు; ఆయనను ఆరాధించేటప్పుడు, కేవలం అల్లాహ్ మాత్రమే అతని ఏకైక ధ్యాసగా నిలుస్తాడు. దీనినే ‘నిజమైన ఆరాధన’ అని వ్యవహరిస్తారు.”

హుజూర్ (అ) మరల ఇలా పేర్కొన్నారు: ఇన్ననీ లకుం మ్మిన్‌హు నజీరున్ వ్వ బషీర్ (హూద్ :3)“నేను మీ కొరకు, ఆయన (దేవుని) తరపున ఒక హెచ్చరిక చేసేవాడిని మరియు శుభవార్తలను మోసుకొచ్చేవాడిని.” హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు: “ఈ ‘తాఅబ్బుద్ తామ్’ (అంటే, అల్లాహ్ మహోన్నతుని కొరకు మాత్రమే, పూర్తిగా మరియు ఏకైక నిష్ఠతో సమర్పించే సంపూర్ణ భక్తి) అనేది అత్యంత ప్రాముఖ్యత కలిగిన విషయం కాబట్టి, ఒక మానవుడు ఒక గొప్ప ఆదర్శం మరియు పరిపూర్ణమైన నమూనా లేకుండా దీనిని నెరవేర్చలేడు. అలాగే, ఒక పవిత్రమైన మరియు దైవిక శక్తి యొక్క సంపూర్ణ ప్రభావం లేకుండా కూడా దీనిని సాధించలేడు. సరిగ్గా ఈ కారణం చేతనే, దైవప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు: ఆ దేవుడే తనను ఒక హెచ్చరిక చేసేవాడిగా మరియు శుభవార్తలను మోసుకొచ్చేవాడిగా పంపాడు. ‘మీరు నాకు విధేయత చూపి, నన్ను అంగీకరిస్తే, మీ కొరకు గొప్ప శుభవార్తలు ఉన్నాయి; ఎందుకంటే నేను శుభవార్తలను మోసుకొచ్చేవాడిని. కానీ మీరు నన్ను తిరస్కరిస్తే, నేను ఒక హెచ్చరిక చేసేవాడిగా వచ్చానని గుర్తుంచుకోండి; అప్పుడు మీరు తీవ్రమైన శిక్షలను మరియు కష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.’”

(మల్ఫూజాత్, సంపుటి 1, పేజీలు 472–473, ముద్రణ 2022)

కాబట్టి, ఇది మనం లోతుగా ఆలోచించాల్సిన విషయం. దైవ ప్రవక్త (స) యొక్క పరిపూర్ణ ఆదర్శాన్ని అనుసరించడం ద్వారా వారిని అంగీకరించిన మనం, వారిని శుభవార్తలను అందించే వ్యక్తిగా స్వీకరించాము. కావున మనం మన ఆరాధన హక్కులను నెరవేర్చి, వారి మహత్తర ఆదర్శాన్ని అనుసరించడానికి అవసరమైన ప్రమాణాన్ని సాధించడానికి ప్రయత్నించినప్పుడు మాత్రమే ఈ శుభవార్తలను పొందగలం. అటువంటి ప్రయత్నానికి త్యాగం అవసరమని, దానికి తీవ్రమైన కృషి కావాలని గుర్తుంచుకోవాలి. అడిగితే, కొందరు తాము ఐదు పూటల నమాజులు చేయడానికి ప్రయత్నిస్తామని తేలికగా చెబుతారు. ఇది తనను తాను మోసం చేసుకోవడం లాంటిది. ఒకరి ప్రయత్నం నిజమైనదైతే, అది తీవ్రమైన ఆందోళన మరియు అశాంతితో కూడి ఉంటుంది. అందువల్ల, మన ప్రయత్నాలు నిజంగా చిత్తశుద్ధితో కూడినవో కాదో మనల్ని మనం విశ్లేషించుకుని తెలుసుకోవాలి.

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు. “దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ఆరాధన యొక్క స్థితిని గమనించండి. వారు హిరా గుహకు వెళ్ళేవారు, ఆ గుహలో పాములు, చిరుతపులులు మొదలైన అన్ని రకాల క్రూర మృగాల భయం ఉండేది. (వారు అక్కడికి విన్నవించుకోవడానికి మరియు ప్రార్థించడానికి వెళ్ళేవారని ఇంతకు ముందే ప్రస్తావించబడింది.) ఈ విషయాన్ని ప్రస్తావించిన తరువాత, మరల వారు (అ) ఇలా అన్నారు: “ఒక వైపు ఆకర్షణ గణనీయంగా పెరిగినప్పుడు, మరో వైపు భయం హృదయం నుండి తొలగిపోతుంది అనేది ఒక సాధారణ నియమం. (సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రేమ యొక్క ఆకర్షణ పెరిగి, ఒకరి దృష్టి ఆయన ఆరాధన వైపు మళ్ళినప్పుడు, అప్పుడు ఇతర ప్రాపంచిక విషయాల భయం తొలగిపోతుంది.) ఆ తరువాత హుజూర్ (అ) ఒక ఉదాహరణ ఇచ్చారు: “సులభంగా భయపడే కొందరు స్త్రీలు, ఒక బిడ్డ అనారోగ్యంతో ఉన్నప్పుడు, పగటిపూట కూడా వెళ్ళడం కష్టంగా ఉండే ప్రదేశాలకు, అవసరం కొద్దీ రాత్రి చీకటిలో వెళ్ళడం చూస్తుంటాము.” మరల ఇలా తెలిపారు: “దేవుని భయం మరియు ప్రేమ ప్రబలినప్పుడు, మిగిలిన అన్ని భయాలు మరియు ప్రేమ రూపాలు అదృశ్యమవుతాయి. అటువంటి ప్రార్థన చేయడానికి ఏకాంతం అవసరం. అటువంటి సంపూర్ణ సంబంధం ద్వారానే దైవిక తేజస్సు వ్యక్తమవుతుంది, మరియు ప్రతి సంబంధానికి అటువంటి ఏకాంతం అవసరం,” అనగా, ఒకరు ఏకాంతంలో దేవునితో సంబంధాన్ని ఏర్పరచు కున్నప్పుడు మాత్రమే అది వ్యక్తమవుతుంది. (మల్ఫూజాత్, సంపుటి 7, పేజీ 186)

మరల ఇలా పేర్కొన్నారు: “ఆరాధన కేవలం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కొరకే ఉండాలి, అది కపటంతో కూడినది కాకూడదు. విధేయత, ఆరాధన మరియు సేవలో సహనంతో ముందుకు సాగితే, అల్లాహ్ దానిని ఎన్నడూ వృధా కానివ్వడు. ఇస్లాంలో, కేవలం వారి ఆధ్యాత్మిక తేజస్సు ద్వారానే ప్రజలు గుర్తించిన వేలాది మంది ఉన్నారు. వారిని ప్రత్యేకంగా గుర్తించడానికి వారికి కాషాయ రంగు వస్త్రాలు, పొడవాటి పైవస్త్రాలు లేదా ప్రత్యేక వస్త్రధారణ అవసరం కాలేదు. అంతేకాక, దైవ సజ్జనులైన సేవకులు ఎవరు కూడా, అటువంటి పైవస్త్రాలను ధరించడం ద్వారా గొప్ప సన్యాసులుగా, సూఫీలుగా లేదా అత్యంత భక్తిపరులుగా పరిగణించబడేలాంటి దుస్తులను ధరించలేదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రజలలో తనను గుర్తించడానికి వీలుగా ఎలాంటి ప్రత్యేక వస్త్రాన్ని ధరించలేదు. పైగా, ఒక సందర్భంలో, ఒక వ్యక్తి హ్రజత్ అబూబకర్ రజిను ప్రవక్తగా పొరబడి, ఆయనకు గౌరవ మర్యాదలు చూపిస్తూ కరచాలనం చేశాడు. ఆ వెంటనే, హ్రజత్ అబూబకర్ రజి లేచి నిలబడి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు విసనకర్రతో విసరడం ప్రారంభించారు. తద్వారా, మాటలతో కాకుండా చేతలతోనే వీరే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అని, నేను సేవకుడను అని నిరూపించారు. ఒక వ్యక్తి దేవుడిని ఆరాధించినప్పుడు, వారు అంత రంగురంగుల వస్త్రాలు ధరించడానికి, ఒక ప్రత్యేకమైన రూపాన్ని అలవర్చుకోవడానికి, లేదా జపమాలలు, పూలమాలలతో అలంకరించుకుని తిరగడానికి వారికి ఏ అవసరం ఉ ంది? (అంటే, కొందరు తమ మెడలో పూసల దండలు వేసుకుని, చేతుల్లో పొడవైన జపమాలలు పట్టుకుంటారు.) అటువంటి వారు ఈ లోకానికి చెందినవారు; వారు దేవునికి చెందినవారు కారు. దైవ మార్గాన్ని అనుసరించేవారు ఒక ప్రత్యేకమైన వస్త్రధారణ లేదా దుస్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడానికి సమయాన్ని వెచ్చించరు. వారు సృష్టి దృష్టికి దూరంగా అదృశ్యంగా ఉండాలని కోరుకుంటారు. అయితే, సర్వశక్తి మంతుడైన అల్లాహ్ తన జ్ఞానానికి అనుగుణంగా, తన దైవత్వాన్ని నిరూపించడానికి కొందరిని బహిరంగ ప్రదేశంలోకి పంపుతాడు.

దైవ ప్రవక్త (స) ప్రజలు తనను ప్రవక్త అని పిలవాలని, తనకు విధేయులుగా ఉండాలని ఏమాత్రం కోరుకోలేదు. ఈ కారణంగానే వారు సమాధి కన్నా ఇరుకైన గుహలోకి వెళ్లి ఆరాధించేవారు, మరియు దాని నుండి బయటకు రావాలనే ఉద్దేశం వారికి ఏమాత్రం లేదు. చివరికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్, తన జ్ఞానానికి అనుగుణంగా, ఆయనను బయటకు తీసుకువచ్చి, వారి ద్వారా తన కాంతిని ప్రపంచానికి ప్రసరింపజేశాడు.” (మల్ఫూజాత్, సంపుటి 6, పుటలు 125–126, ముద్రణ 2022)

అల్లాహ్ తాలా ఈ కాంతిఆశీర్వాదాలను పొందే శక్తిని మనకు ప్రసాదించుగాకా!. అల్లాహ్ ఆరాధన యొక్క సముచిత హక్కులను నెరవేర్చడానికి మరియు దైవ ప్రవక్త (స) గారి ఉన్నతమైన ఆదర్శాన్ని అనుసరించడానికి మనకు సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!. మరియు వారి ఉన్నతమైన ఆదర్శాన్ని దాని నిజమైన స్ఫూర్తితో అనుసరించడానికి కృషి చేసే సామర్థ్యాన్ని అల్లాహ్ తాలా మనకు ప్రసాదించుగాకా!.

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz